UNIVERSAL LIBRARY
OU_204449
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 83.1/V 25P Accession No. T 2528

Author

Title పల్లెటూరి కథలు

This book should be returned on or before the date last marked below.

# పల్నాటి కథలు.

"పల్లెపదాల జీవముఁనిల్పికొన్న ప
ల్నాటివీరుల రక్తనాళపటిమ."

గ్రంథకర్త:

మహావాది వేంకటరత్నముగారు.

పబ్లిషర్సు:

వేంకటరామ్ అండ్ కో.,

బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ.

1932.

ఓమ్.

# పల్నాటికథలు.

## ౧. పల్నాడు.

కథా పరిచయము.

పూర్వ మొకప్పుడు త్రిలిఙ్గదేశము సకలసంపదలతో విరాజిల్లియుండకపోలేదు. ఆస్థితియందీ త్రిలిఙ్గదేశమధ్యంబున నెన్నియోసీమలు పేరన్నిక వహించి యుండెను. అట్టివానిలోఁ బల్నాటిసీమ అగ్రస్థానమును వహించి యుండెనని చెప్పకతప్పదు. అనాదినుండియు నీసీమ వీరరసంబునకుఁ బుట్టినిల్లగుచు, శత్రుసమూహంబులకు దుర్గమంబగుచు, మిత్రబృందంబులకు సుగమంబగుచు, సుకవుల కలముపోటులకు నిలయమగుచుఁ బల్లెపదాలవలన జీవములు నిల్పుకొను భిక్షువుల కమృతప్రాయ మగుచు, ననేకరీతుల విలాసగతుల నలరియున్నదనుట అతిశయోక్తి కానేరదు. ఇట్టి విభవాభిరామ మగు నీపల్నాటి వీరవిజయలక్ష్మీచారిత్రంబునఁ జరిత్రాత్మకంబుగఁ బ్రకటితంబులుగాక *మాలదాసువాలుకల నాట్యంబు సల్పుచును,

---

* మాలదాసులు కడమజాతికి సంబంధించిన యొకతెగవారలు. వీరిప్పుడు వీరచారిత్రంబుల రగడలరూపంబునఁ బల్లెవారలకు వినుపించుచు జీవనోపాధి గలిగించుకొందురు. ఈయాచార మిప్పుడును బాలింపఁబడుచునే యున్నది.

వారలకు వీరరసోద్రేకంబును, మరియువారల కధికోత్సాహంబును గలిగించుచుఁ గావ్యప్రపంచమునఁ దగిన స్థాన మేర్పఱచుకొనిన కొన్ని గాథలు గలవు. అవియే ప్రస్తుతగ్రంథమునకు మాతృకములు.

ఆదియందుఁ బల్నాటి సీమను పల్లవవంశీయులు పాలించుటవలన నియ్యది పల్లవనాఁడు అని వ్యవహరింపఁబడెను. కాలము గతించినకొలఁది పల్లవనాఁడు అను దానికి పాలనాఁడు అను శబ్దవైపరీత్యము కలిగి యదియుఁ బోనుపోను పల్నాడు అను వ్యావహారికత్వమును బొందెను. ఈయర్థము చరిత్రాంశములవలన సమర్థింపఁ బడుచున్నది.

పల్నాడు.

కాని యియ్యది వంశీయము గాదనియుఁ గేవలము దేశీయమే యనియుఁ గొందఱు సకారణంబుగఁ బల్కుదురు. ఈసీమయందంతటను పాలరాళ్లు మెండుగ నుండుట వలన నియ్యది తొలుదొల్తఁ బాలనాఁడు అని పిలువంబడి క్రమక్రమముగా పల్నాడు అను వ్యావహారికహ్రస్వత్వము నొందె ననియుఁ జెల్పుదురు. ఇదియును విచారణీయాంశమగుచున్నది. కావున నీరెండును నించుమించుగా సమానకారణములే యగుచున్నవి.

నదులు.

ఈసీమయందు సాగుబడి కనువగు నదులెవ్వియును గాన్పింపవు. నాగులేరు, చంద్రవంక అను రెండునదులు ముఖ్యములగుచున్నవి. ఇచ్చోట చంద్రవంక జలపాతము (Waterfalls) చూడదగిన వానిలో నొకటి యగుచున్నది. కృష్ణానదిమాత్రము పొలిమేరల నానుకొని ప్రవహించుచుండును. భూములన్నియు దైవమాతృ

కము లేగాని నదీమాతృకములు గావు. దైవమాతృకము లైనను పంటవృద్ధి యంతగాఁ గలిగియుండినవి గావు. కొండప్రదేశ మగుటవలన మిట్టపల్లములు గలిగి పచ్చికబయళ్లకు

భూమి.

మిక్కుటముగ నాకరమగుచున్నవి. దానఁ జేసియే యచ్చోట పశువృద్ధి అధికముగా నుండుట సంభవించుచున్నది. పంటలు సర్వసాధారణముగా నుండును. చాలవఱకు సీమయం దచ్చటచ్చట చిన్నచిన్న గుట్టలును, లోయలును, కొండలును గలిగి చూపరుల కానందముగను, దేశీయయోధాగ్రేసర శౌర్యప్రకటనానుకూలంబుగను, పరప్రాణాపాయకరంబుగను నెగడుట ఇప్పటికిని లోకవిదిత మగు

కొండలు.

విషయమగుచున్నది. చరిత్రగౌరవమున *నాయకురాలి కనుములును, దేశగౌరవమున ‡ గుత్తికొండయును నెక్కుడు వన్నెకెక్కియున్నవి. పట్టణముల కిప్పుడీ రెండు గౌరవములును లేకున్నవి. కాని చరిత్రరూపకమున,

---

* ఈకనుములు కొంతవఱకుఁ జరిత్రాత్మకము లగుచునే యున్నవి. బ్రహ్మనాయని సమయింప నాయకురాలు ససైన్యయై యాతని నెదిరించి యాతనిని, యాతని బలమును నడ్డగింపఁ దెరువేదియు లేక, యాతఁడు క్రోధోద్దీపితుఁడై, నిజఖడ్గంబున నాకొండను గొట్టె నది వజ్రపాతమైన చందమున, నచ్చోట దారి యేర్పడినది. అది యొక కనుమమార్గముగ నుండుటఁబట్టి నాటనుండి నాయకురాలి కనుమ లని వ్యవహరింపఁబడినవి.

‡ 'గుత్తికొండబెళం, గుత్తికొండబెళం' అని యాత్రికులు స్నానార్థమై యేగున దీర్ఘలమునకే. ఇచ్చోటు ముక్కోటినాఁడు చాల బాగుగా నుండును. చూడదగిన విషయము.

మాచెర్లకును, కారెంపూడికిని ప్రబలగౌరవ మున్నది.

పట్టణములు.

దాచేపల్లి కావ్యప్రపంచగౌరవమున మించియున్నది. శ్రీనాథునిహాస్యరసప్రకటనావిధానమున కిది యే మూలసాధనము. రెంటచింతల క్రైకమత్యగౌరవ మున్నది. మొత్తముమీఁద పట్టణము లన్నియుఁ దొంటివిభవమున నామావశిష్టములై యున్నను, నిప్పటికిని గొంచెముగనో గొప్పగనో తొంటిసౌభాగ్యచిహ్నములకు దెగాలమాత్ర యుండకపోలేదు. ఇంకను బూర్వుల రక్తనాళపటిమ పల్నాటిజనులయందు సంపూర్ణముగా నశించిపోలేదు.

పల్నాటిజనుల యాచారవ్యవహారము లన్నియుఁ గడు నీచాతినీచములుగను, జనులు కేవల మనాగరకులవలెనే గాక, పశుప్రాయులవిధమునను, నిప్పటివారలకుఁ గొందఱికిఁ దోచుచుండుటఁ జూడ వింతగా లేకపోలేదు. నమ్మినవారిని

జనులు.

జెఱుపని వారలును, స్వామిద్రోహ మొనర్పనివారలును, కపటమార్గానుసరణ మెఱుంగని వారలును, నింత తమిదయుంబలి దారిద్రి యున్నంతదానితోనే సంతుష్టి నొందుచు నిరాడంబరులై యుండువారలును, మాటవచ్చిన బత్తెపుపోటులతో సమానము లగు వారలును, ప్రాణ మిచ్చినఁ బ్రాణ మిచ్చువారలును నగు పల్నాటిజనులను గేవలము పశుప్రాయులనియు, నాగరకతావిహీనులనియుఁ బలుకు నిప్పటియువకుల తెలివితేటలు నిజముగ నద్వితీయము లని నొక్కిచెప్పక తప్పదు. ఇప్పటి పల్నాటిజనుల యాచారవ్యవహారము లెంతవఱకు నీచాతినీచములో పాఠకులకుఁ దెలియ

**వీరారాధనము.**

వలయును. వీరారాధనము, శక్తిపూజయుఁ దరుశిలావిగ్రహ భజనంబును మున్నగునవి వీరలకు వంశక్రమాగతములై యున్నవి. వీరారాధనము ప్రతిదేశమందును బ్రతిజాతియందును బూర్వమునుండి ప్రబలుచున్నదియేగాని నేఁడు క్రొత్తగా వచ్చినది కాదు. ఇంగ్లీషుమహాకవియగు కార్లైలు వీరారాధనమునుగురించి పలికిన యుద్బోధకము లిప్పటికిని బశ్చిమదేశంబునఁ బ్రతిధ్వనించుచునే యున్నవి. ఆంధ్రకవిశిఖామణులగు తిక్కనాదుల పలుకులు భరతవర్షమునఁ బ్రతిభారతీయుని శ్రవణపుటంబుల మారుమ్రోగుచునే యున్నవి. ఇట్టి వీరారాధనము స్తోత్రరూపముననేగాక క్రియారూపమునను పల్నాటిజనులవలన నిర్వర్తింపబడుచున్నది. పల్నాటి యుద్ధము భారతయుద్ధముతో సరిపోల్చవచ్చును. బ్రహ్మనాయుఁడు కృష్ణుఁడనియు, బాలచంద్రుఁడు అభిమన్యుఁడనియు నిట్టుల నాయకులఁ బేర్కొని యేడాది కొకమారు పల్నాటియందు వీరపూజ యొనర్పంబడును. ఇయ్యది మూఁడు రోజులు జరుపఁబడును. ఈమూఁడురోజులును యుద్ధక్రమము ననుసరించి, యిరుపక్షములవారలను పిల్వనంపుటయు, రాయబారము నడపుటయు, రణభేరుల మ్రోగించుటయు మున్నగు వానిని రోజున కొక్కటిగా నడపి, మూఁడవరోజున భూత తృప్తిగా రుధిరాన్నము నర్పింతురు. ఈ మూఁడురోజులును సంగ్రామంబునంబలె అతికోలాహలముగను, సర్వజగన్నాధముగను నుండును. ఇప్పటికిని నియ్యది పల్నాడునందు జరుగు

చునేయున్నది. చూచుట కనేకమంది వచ్చుచునే యున్నారు. నిజముగఁ జూడదగిన విషయము.

శక్తిపూజ.

తరతరంబులనుండియుఁ బల్నాటిజనులకుఁ బ్రబలముగు మూఢనమ్మకము గలదు. అందువలననే పిశాచి, మశూచి, తడపర, ఆటలమ్మ మొదలగు జాడ్యములు వచ్చినపుడు, తన్నివారణమునకై, పూర్వాచార క్రమము ననుసరించి యాయా శక్తుల నారాధించుటయు, వాని తృప్తికై బలు లర్పించుటయు మున్నగునవి జరుగుచుండును. ఇదియేమియు భారతవర్షమునఁ జిరకాలమునుండియుఁ బ్రబలుచున్న శిష్టాచారమేగాని, నేఁడు నూతనముగా వచ్చినది కాదు. కొన్నియెడల నియ్యది గమనింపఁదగినదియును యేగాక, యత్యావశ్యకమైనదనియు భారతాదులు పల్కుచునే యున్నవి. ఈయాచార మిప్పటికిని బల్లెలయందు సక్రమముగాఁ బాలింపఁబడుచున్నది.

తరుశిలా విగ్రహారాధనము

గాలికుంట్లు మొదలగు పశుజాడ్యములు వచ్చినప్పుడుగాని, పఱపు కలిగినప్పుడుగాని, తరుశిలావిగ్రహారాధనములు నిర్వర్తింపఁబడుచుండును. కనీసము వత్సరమున కొక్కమారైనను హరిసుపూజ గావింపఁ బడుచుండును. ఇచ్చోట బ్రాహ్మణాచార ప్రకారము పూజావిధానము జరుపఁబడునుగాని, బలు లర్పించి త్రాగి తందనాలు వైచుచు, మూఁకలుగట్టి కేకలిడు నాచారప్రకారము జరుపఁబడదు. వీనివలన, దైవబలమునకో, లేక స్వాభావికముగనో, లేక జనుల మూఢభక్తి

విశ్వాసముల వలననో యెట్లయిననేమి యాయారోగములు నివారణమగుటయు సంభవించుచునే యున్నది. వఱపు కలిగి నప్పుడు వరుణపూజ సల్పుటయుఁ దొలకరియప్పుడు కృషి పూజ నొనర్చుటయు మున్నగు నాచారము లన్నియు ననాదియ ము లని చరిత్రమువలనఁ దెలియవచ్చుచునే యున్నది. ఈ యాచారంబుల మూలంబున బ్రాహ్మణభక్తి పల్నాటివాసు లయందు మిక్కుటముగాఁ బ్రబలియున్నది. ఇట్టి యాచారము లన్నియు నిప్పటి యువకులకుఁ గొందఱికి నీచాతినీచము లుగాఁ గన్పట్టుచున్నది.

పల్నాటిజనుల యాచారవ్యవహారము లన్నియు నీవిధ ముగానే యున్నవి. ఇందు జనులయందును బెక్కుజాతులు లేక సజాతి విజాతి క్రమము ననుసరించియే యున్నవి. కాని

జాతులు.

నాలవజాతి యగువారు మాత్రము మూఁడుపాళ్లు రెడ్డివంశీయులై యున్నారు. వీరు పేరునకే గాక క్రియాకలాపమునను దమపూర్వులఁ గొంతవఱకు మఱపించు చునే యున్నారు. చాలవఱకు వీరందఱును హిందూమతావ లంబకులే గాని భిన్నమతములు గలవారలుగారు. ఒక్క

మతము.

రెంటచింతలయందు మాత్రము క్రైస్తవమతము నకుఁ దావు లభించినది. కొందఱియందు మతభేద మగపడు చున్నను, పంక్తిభేదముగాని, స్వభావభిన్నతగాని వారల యందింతవఱకంతగాఁ బ్రబలియుండలేదు. మతము విదేశీయ మైనను, కట్టునందును, బొట్టునందును, జుట్టునందును చాల వఱకు స్వదేశీయ మతానుసరణముగానే నెగడుచున్నది. కాల

చక్రిముఖంబు వింతమార్పులు గలుగుచున్నను పల్నాటి
జనులప్రవృత్తియం దంతగా మార్పులుగలిగియుండలేదు.
వృత్తి.
వీరలకు ధనార్జనోపాయమాత్రము చక్కగాఁ
దెలియునుగాని ధనవ్యయముమాత్ర మిప్పటి యువకులకువలె
చక్కగాఁ దెలియదని నొక్కివక్కాణింపవచ్చును. దీనివం
ననే యీఁబోలు ప్రస్తుతయువకులకంటెను వీరలు కేవలము
పశుప్రాయులుగఁ గన్పట్టుచుండుట. సర్వసాధారణముగా
జనులందరు కృషికులే గాని పురాణవిద్యాశిక్షమువలన మాన
వత్వముగోల్పోయి సేవకకృత్యములకుఁ బాల్పడినవారలుగారు.

ఈ సీమయందు వర్తకమేమియు నంత గొప్పదియుగా
నుండలేదు. ఇందు సాగుబడియగు పత్తియంతయు స్వరాజ్య
చక్రభ్రమణమునకే చాలకున్నది. ధాన్యము జీవనోపాధికి
మూలమగుచున్నది. మానవ జీవరక్షణోపాయ
వృత్తి
ములకువలయు వస్తుసంచయముల నన్నింటిని పల్నాటి
వీరలక్ష్మియే కైకొనుచు నామెకుఁ బసికిరాని యిస్లకొండ
రాష్ట్రమాత్రము తక్కిన వారి కందిచ్చుచుఁ దద్ధనంబువలనఁ
గొన్న నూతనాలంకారముల నేర్పఱుచుకొనుచుఁ దనవైభ
వము నభివృద్ధిపరచుకొనుచున్నవి. ఈసీమ భూమియంతయు
ఆతిభూమియైయున్నను శీతోష్ణస్థితిమాత్రము సమముగానే
యుండును. నాగులేరు చంద్రవంకలు జీవనదు
శీతోష్ణస్థితి.
లంబలె నెల్లప్పుడు ప్రవహించుచునే యుండుట
వలన నీటివసతికిని, జల్లనిగాడ్పులకును నేకొఱంతయు లేకుం
డెను. మండువేసంగియందు సయితము దాచేపల్లియందలి

పూకుతోఁటలును, ఫలవృక్షచ్ఛాయలును, లేఁబచ్చిక బయళ్లును సకలజనులకు నామోదకరంబులే యగుచున్నవి. ఇవియే పల్నాటిని గుఱించియు దజ్జనుల యాచారవ్యవహారములను గుఱించియు, జాతిమతవృత్తిపరిస్థితులఁ గూర్చియుఁ దెలిసికొన వలసినది. ఇట్టి పల్నాటిజనుల విస్మయాశ్చర్యకరకృత్యములఁ గూర్చి తెలిసికొనుటయేగాక, వారియుపాయముఁ జనువుటయుఁ బ్రశంసనీయములే కదా.

## ౨. మాలదాసు.

గీ. మేనికండల నర్పించియేని నరుఁడు
తనకు నన్నివిధాల మేలొలఁచువారి
ఋణమునుండి విముక్తుఁడై యొసఁగునెడల
నతఁడె ష్కృతిలేనివాఁ డని యనిరి బుధులు.

అమ్మనన్నరెడ్డి జన్మభూమి కారెమపూడి. అతనివంశీయు లందఱును బేరు ప్రఖ్యాతుల గడించినవారలే. అట్టి వంశ గౌరవమును అమ్మనన్నరెడ్డి తనకాలమున ద్విగుణ మొనర్చెను. ఈతని శీలముఁగూర్చి వర్ణించుటకన్న సుగుణములన్నియు నితనియందు ఘనీభూతములగుచున్నవని పలుకుటయే సమంజసము. ఆకారము చామనచాయ. ఇంచుమించుగా నలువది వత్సరములవాఁడు. వృద్ధాప్యము దాపరించుచున్నను, బలహీనత దూరమగుచునే యున్నది.

అమ్మనన్నరెడ్డి.

ఇంత యీడుగలవాఁడైనను చత్వార మనునది యెఱుంగఁడు. నాగలి చేబూని చాలుగొట్టినయెడల రూలుగఱ్ఱతోఁ గొట్టిన గీటునందేని వంకర యుండవచ్చునుగాని, యాతని నాగలిచాలు నందు వంకరయనునది యుండనే యుండదు. "కుందేలును గొట్టినవాఁడే వేటకాఁడు, గొఱ్ఱుపట్టినవాఁడే సేద్యగాఁడు" అనునట్టులు గొఱ్ఱుదున్నకమునం దితఁ డసమానుఁడు. ఇతని భార్యపేరు నాగమ్మ. ఈమె మహాయిల్లాలు. సుమారు నలువది యేండ్లకు మించిన ప్రాయముగలది. ఇంటికివచ్చిన వారలకు

లేదను బుద్ధికి బుద్ధిచెప్పు స్వభావము గలది. ఆమె యెల్లప్పుడు చేరెడు వెడల్పు కుంకుమబొట్టు పెట్టుకొని నిండు చెంగావి చీర కట్టుకొని కళకళలాడుచు గృహమునకు లక్ష్మీస్వరూపము వలె నుండును. వఱువాత లేచి యామె మొగముఁ జూచిన పాపములన్నియుఁ దొలంగిపోవు నని యూరి యమ్మలక్క లందఱు తలంచుచుండెడివారు. ఆమె కడుపు చల్లగ బంచ పాండవులవలె నామె కైదుగురు కుమారులుగలిగిరి. వారును నాకారమునఁ దల్లిని, గుణమునందును, సాహసము నందును దండ్రిని బోలియుండిరి. కుమారు లందఱు చేతికక్కఱకువచ్చి నది మొదలు అమ్మనరెడ్డికిఁ దగినవిశ్రాంతి లభించెను. కుమారు లాతని నేపనిఁ జేయనీయక, యింటికడనే యుండుమని తండ్రికిఁజెప్పి, పొలముపను లన్నియు వారలే చూచుకొను చుండెడివారు. అమ్మనరెడ్డియు నేదిగులు లేక హాయిగాఁ దన కాలమునంతయు ధర్మమార్గమున గడపుచు నప్పుడప్పుడు పొలముపనుల కరుగుచుఁ గుమారుల లోపాలోపములను సవరించుచు నిటుల జీవితమును గడపుచుండెను.

అన్నివిధముల అమ్మనరెడ్డి కొనియాడఁ దగినవాఁడగుట వలన, నాయూరివార లందఱాతనిఁ దమకుఁ బెద్దకాపుగా నెన్నుకొని గౌరవముఁ జూపుచుండిరి. ఆతఁడును గ్రామస్థుల కనుగుణ్యముగా మెలంగుచు నందరిచేతను మంచివాఁడని యనిపించుకొనెను.

ఈ విధముగాఁ గొన్నాళ్ళు బాగుగా జరిగినది. కాని అమ్మనరెడ్డికి దుష్కాలము ప్రాప్తమగుచుండెను. గ్రామస్థుల

యం దాతనియెడల నొకవిధమగు విరోధభావము జని యించెను. అయ్యది కారణరహితమో, లేక కారణసహితమో చెప్ప వలనుపడదు. మొత్తముమీద నాతనికి గ్రామము నం దొంటి గౌరవము నశించినది. కమనీయ కుసుమముల మాటునఁ గాలసర్ప మున్నదని జను లభిప్రాయపడఁజొచ్చిరి.

గ్రామ విరోధము.

ఊరివారందఱును నొక్కటిగను, అమ్మన్నరెడ్డి యొక్కఁడు నొక్కటిగను గ్రామమునఁ గక్ష లేర్పడెను. తనస్థితి యకారణముగ మారిపోవు చున్నందుకు రెడ్డి కెంతయో విచారము జనించినది. కాని యేమిచేయఁగలఁడు? కుమారులు మాత్రము దీనిని లెక్క చేయకుండిరి. వలసినంత ధనమున్నదనియుఁ దన్మూలమున నెంతటిపని నేనియు నతిసులభముగ నెరవేర్పఁబడఁగలదనియు ననుభవశూన్యులగుటవలన వారు దురభిప్రాయపడుచుండిరి. అమ్మన్నరెడ్డి యన్ననో, దూరదృష్టి గలవాఁ డగుటవలనను, యనుభవశాలియగుటవలనను, నేసమయమున నేమికీడుమూడు నోయని శంకించుచునే యుండును. ఒంటరిగఁ బోవుటకేనియు నాతఁడు భయపడుచుండును. గ్రామస్థులైనను బ్రబలవిరోధ భావమునే కలిగియుండిరి. సమయమగునెడల సమయింపవలె ననియు సమయమొనర్చుకొని యుండిరి. గ్రామవిరోధ మింత గానున్నను పెద్దకాపుపదవి మాత్రము మాతనికే యుండెను.

కాల మిట్లులే గడచిపోవుచుండును. అమ్మన్నరెడ్డి యొక నాడు వేకువనే లేచి యరకితోలుఁకొని పొలమునకుబోయెను. పొద్దు నెత్తిమీదికి వచ్చువఱకు భూమి దున్ని, యంత

కోటేరు వేసికొని యింటికివచ్చుచుండెను. ఇంటికి రావలయునన్న నాతఁడు మాలపల్లెమీఁదుగా రావలయును. అయ్యాదితోటలు దున్ను కాలమగుటవలన, బల్లెయందుగల పిల్లాదిమధ్యము పొలముపనికి వెళ్ళిరి. అతఁడు మాలపల్లెమీఁదుగా వచ్చుచున్నప్పుడొక భయంకరవ్యక్తి యాతనికి దృగ్గోచరమయ్యెను. ఆవ్యక్తిని గాంచినంతనే సహజముగాఁ గరుణాస్వభావుఁ డగు నాతని మానసము నిలువున నీరై పోయెను. అట్లగుట లోకవిరుద్ధముగాదు. ఆవ్యక్తి యెవ్వరో గాదు. పదియేండ్లు ప్రాయముగలిగి మాలదాసను పేరున వ్యవహరింపఁబడు నొక పంచమబాలుఁడు. ఈతనిచరిత్ర మిక్కిలి జాలిఁ గొలుపునది. పాపమీతఁడు గర్భముననుండగనే తండ్రి గతించెను. ఈతనికి నాలుగైదేండ్లు వచ్చునప్పటికిఁ దల్లి గతించెను. అప్పటినుండియు నా యనువారు లేక, యేయయ్యగాండ్ర దగ్గరనో పేడకళ్లు దీయుచు నొకరోజు కడుపునిండఁ దిన్న, రెండురోజులు

మాలదాసు.

పస్తుబండుకొనుచు, నెండకు నీడయుఁ, జలికిగుడ్డయు ననునవి యెఱుంగక యేమహాత్ముని యింటిబయటి యరుగుమీఁదనో రేయిగడపుచు నిట్లు కష్టదశను వెళ్ళబోసికొనుచుండెను. స్వజాతివారియందు దరిద్రదేవత సహజముగ తాండవ మాడుచుండును. కనుక వా రీతని కాధారము గాజాలక పోయిరి. ఊరివార లాగర్భశ్రీమంతులుగనుక వారివలనను నాతనికి సహాయము లభింపకపోయినది. ఎనిమిదియేండ్లు వచ్చినప్పటినుండియు గ్రామమునసబుగారియింట్లో జీతమునకుఁ గుదిరెను. వారు పెట్టునది రెండుపూటలేమైనను

గొట్టుటమాత్రము ముప్పూటలు జరుగుచునే యుండును. జీతమిచ్చుటయందు మొగమునఁ బేలాలు వేగుచున్నను జాకిరి చేయించుకొనుటయందు వారు పెట్టుతిండి. కొట్టుదెబ్బలకుఁ బ్రతిదినము బాకీపడుచున్నను వేఱుమార్గము లేక, మాలదాసు మణియరుగారియింటియందే యుండెను. ఆరోజున పాప మాతఁడు, క్రిందటిరోజు, ప్రొద్దుగూఁకులు మిరుపచెట్లు లేవ దీయుటవలన, బడలికఁ జెంది, బాగుగాఁ దెల్లవారునప్పటికి లేచెను. అందువలన నింటివారలందరికి బట్టరాని కోపము గలిగి తల కొకదెబ్బవంతునఁ గొట్టి 'పొట్టపగిలేటట్లు మేపి కూర్చుండఁబెట్టుటకు మావల్లఁగాదు పొమ్మ'ని వెళ్ళఁగొట్టిరి. మణియరుగారు పాలికట్టుతోఁ గొట్టుటవలన నాతని శరీర మంతయు దద్దుగట్టి రక్తమయమై యుండెను. ఇవ్విధమున భారతదేశమందు నేఁ డెంతమంది బాధపడుచుండిరోకదా! పాపము! అతని కేమియుఁ దోచక కంటికిఁ గడివెడుగా వెక్కి వెక్కి యేడ్చుచుఁ జూచువారలకు గుండెలు పగిలిపోవునట్లుగా దల్లిని దండ్రిని దలంచుకొనుచుఁ దనతల్లిని చచ్చిపోయినప్పుడు తన్నుదగ్గరకుఁ జేరదీసినవారికడ కేగి, యింటి బయటనున్న వేపచెట్టుక్రిందఁ గూలఁబడియెను. ఆయింటివారును, జుట్టు ప్రక్కలనున్నవారును బిడ్డలఁ గన్నతల్లులుగనుక, యింతసేపు కండ్లనీరుపెట్టుకొని, శోషవచ్చి పడిపోవుచున్నయాతని గొంతుకలో నింత గంజిపోసి వారిలో నొక పుణ్యాంగన యాతనిబాధ చూడఁజాలక, యుపశమనంబునకై, వేడికాపు కాయఁ జొచ్చెను. పొలముపని కరుగువేళ డగ్గఱినప్పు డందరును

నాతని నొంటిగా విడచి వెళ్ళిపోయిరి. అతఁ డట్లే చెట్టుక్రిందఁ బడి తీపులు తీసికొనుచుండెను. ఇట్టి వ్యక్తిని గాంచినంతనే ధర్మస్వరూపుఁడును, బిడ్డలఁగన్న తండ్రియునగు అమ్మన్నరెడ్డి హృదయము నీరైనదనుటలో నతిశయోక్తి యుండగలదా?

మాలదాసు పెద్దకాపును గాంచినంతనే వెక్కి వెక్కి యేడువ నారంభించెను. అచ్చట నాడుకొనుచున్న మాల పిల్లలు కొందఱాతని సమాచారము నంతయుఁ దెలియఁ జెప్పిరి.

పట్టుగొమ్మ.

అమ్మన్నరెడ్డి వెంటనే యాతని స్వహస్తములతో లేవదీసి యెవ్వరితో నేమియు మాటలాడక తనయింటికి దీసికొనిపోయెను. నాగాంబ యాబిడ్డస్థితిని చూడఁగనే కన్నుల నీరుబెట్టుకొనెను. కుమారులందరును మాలదాసునిఁ దమయింట నుంచుకొనుటకుఁ దండ్రినిఁ గోరిరి. ఇవ్విధమున నందఱును జాలిగుండెగలవారగుటవలన నంతటి నుండి మాలదాసునిఁ దమకుంబలెఁ జూడదొడంగిరి. అతఁడును నాఁడు మొదలుకొని తనకష్టములు గట్టెక్కినవని యుప్పొంగి రెడ్డిని, రెడ్డిభార్యను, గన్న తల్లిదండ్రులుగను, రెడ్డికుమారులను సోదరులుగను భావించి విశ్వాసము గలవాఁడై వర్తింపఁ జొచ్చెను. ఇంటివారలును నాతని యభిప్రాయమునే గలిగి యుండిరి.

మాలదాసునకుఁ గష్టదశయంతరించి సౌఖ్యదశయంకురించినది. దీనితోఁబాటు బాల్యదశగతించి యౌవనదశ ప్రారంభమయినది. పెండ్లియీడు వచ్చుటఁజేసి అమ్మన్నరెడ్డి యాతనికిఁ దగిన సంబంధమును మాట్లాడి చిన్నకుమారుని

తోఁబాటు వివాహము నొనర్చెను. ఆతనిఁగూడ నొక కుటుంబీకునిఁగాఁ జేయఁదలంచి నిజగృహబాహ్యప్రదేశంబున నొక యిల్లుగట్టించి కుమారులయనుమతిని గొంతభూమినిఁ గూడ నొసంగెను. మాలదాసుఁగూడ నొకకుటుంబీకుడయ్యెను. కట్టెలనమ్మినచోట బూవుల నమ్మ నారంభించెను. దీనికిఁ గొందరు గ్రామస్థులీర్ష్యాపరవశులు గాక పోలేదు. అయిననేమి? ఆతనికిఁ దగినయండ లభించినది.

ఐకమత్యము.

అమ్మన్నరెడ్డి కుటుంబమును, మాలదాసుని కుటుంబమును రెండును గలిసియున్నప్పుడు చూచినవారికి గుండె గాలమువలె నుండెను. అమ్మన్నరెడ్డికి గ్రామవిరోధమువలన నిదివఱకు గలిగిన భయమంతయు నొక్కమారుగా మటుమాయమై పోయినది. మాలదాసు తన స్వామిని నెల్లప్పుడు గంటికి ఱెప్పవోలెఁ గాచుచుండెను. ఆతని భక్తివిశ్వాసములు గాంచిన కొలంది, రెడ్డికేగాక, యాతని కుమారులకును నాతనియెడ గౌరవము కలుగ నారంభించెను.

ఋతుచక్రమనేకవిధముల మారుచుండెను. కొన్ని సంవత్సరములు గతించెను. అప్పుడు వానకాలము. భాద్రపద మాస మంతరించుచున్న సమయము. పునాస చక్కగా ఫలించి కోతకు వచ్చియుండెను. అమ్మన్నరెడ్డి చాలవఱకు గింజపైరు నాసంవత్సరము సాగుబడి చేసెను. అదియును జక్కగాఁ గలిసి వచ్చినది. జొన్న కోయువలయు నని తలంచుచుండిరి. వారి పొలముపనులకు వేఱుగాఁ గూలివారలక్కఱ లేకుండెను. మాలదాసుని కుటుంబమువారును, రెడ్డికుటుంబమువారును

గలిసినఁ బొలముపనులన్నియు వారలకే చాలకుండెను. అందు వలన నాఁడు పూర్ణిమయగుటంజేసి, యాపండు వెన్నెలయందు జొన్నఁ గోయవలయు నని సంకల్పించుకొని యెల్లరును బొద్దుగ్రుంకకమునుపే, బువ్వఁదాగి చక్కఁగా వెన్నెలవచ్చునప్పటి కందఱు నాకురాయి కొడవళ్లు చేఁబూని, చుట్టలు మీటుకొనుచుఁ గదన మొనర్ప నరుగు యోధులంబలెఁ జూచువారలకుఁ దోఁపఁజేయుచుఁ బొలమున కరిగిరి. ఇంటియందు రెడ్డియు నాతనిభార్యయు నిలిచియుండిరి.

జొన్నకోత.

నాఁడు కారెమపూడియందు బహుసందడిగా నుండెను. అయ్యది వానకాల మగుట వలన నెచ్చోటఁ జూచినను రోగములు ముమ్మరముగా నుండెను. మశూచిజాడ్యమువలన గ్రామమున రోజునకుఁ గనీసము పదిమందినేనియుఁ జచ్చుచుండిరి. అందువలన గ్రామస్థులందరు నాలుగు దినములనుండియే పోలేరమ్మవారినిఁ గొలువ నారంభించిరి. మొదటిరోజు సాటింపుజేయించి బోనములు చెల్లించిరి. రెండవరోజు గ్రామమధ్యమునఁ బురము వేసి మారెమ్మను నిలువబెట్టిరి. మారెమ్మతల్లి కొలుపువలన రోగనాశనమగునో కాదో చెప్పలేముగాని యామహాజనని భీకరాకారము గాంచినంతనే కలుగు భయము వలనఁ గొందఱు తెల్లవాఱువఱకే యూరికి దూరముగాఁ జేరగలరని మాత్రము చెప్పవచ్చును. ఆమిడిగ్రుడ్లు, ఆభీకకరవాలము, ఆరక్తవర్ణము, అబ్బా! చూచినంతనే గుండె ఝల్లుమనక మానదు. మూడవరోజు అమ్మవారికిఁ గుంకుమబొట్లు కట్టుకొని పోవుటయు, రుంజలు, తప్పెటలు, బూరలు, గొమ్ములు

మొదలగు వాద్యవిశేషములతో నుత్సవ మొనర్చుటయు మున్నగునవి జరిగినవి. నాల్గవరోజు అమ్మవారిని సాగనంపురోజు. నాడు భూతబలియొనర్చుట మున్నగునవి జరుగును; ఆరోజు పగటిపూట నెక్కడజూచినను తందనాలును, పెటాలమోతల చప్పుళ్ళును, గణాచారులయార్భాటములును, జనుల కోలాహలములును వినవచ్చును. ప్రొద్దుగ్రుంకుటయే తడవుగాఁ దంత్రజ్ఞుఁడు పోలేరమ్మగుడిదగ్గర బలిఖడ్గములకు పూజ లొనర్పసాగెను. గుడికి సమీపమునఁ గొమ్ములవంకర లేక కడు నందముగానున్న దున్నపోతులు షుమారు పది నిలువఁబెట్టబడి యుండెను. మోమునఁ బసపు గుంకుమములును, మెడలయందు వేపాకు దండలును మొదలగువాని వలన వాని నలంకరించిరి. ఆచారప్రకారము వాని నా పోలేరమ్మ తల్లికి బలిగా నొసంగెదరు. అన్నియు సిద్ధములై యుండెను. బలి నొసంగువాఁడు రెండు చేతులతో ఖడ్గమును బలముగను, పదిలముగను బట్టుకొని యాజ్ఞకై వేచియుండెను.

కొలుపు.

కొలుపులయందును గొన్ని గ్రామముల యందు భిన్నాచారములున్నవి. ఊరి పెద్దకాపు బలి నర్పించునంతవఱకితరము లగు బలు లెవ్వియు నర్పింపఁబడఁ గూడదు. ఈ యాచారము కారెమపూడియం దుండుటవలన, అమ్మన్న రెడ్డి యుదికిన దోవతి గట్టుకొని, చక్కగాఁ దలగుడ్డ పెట్టుకొని, యొక గొఱ్ఱెపోతును బట్టుకొని యమ్మవారిగుడికడ కరిగెను. ఆనాఁ డాతని కక్కడందఱును బ్రబలగౌరవమును జూపిరి. అమ్మన్న రెడ్డి కది చాల వింతగా దోఁచెను. విరోధము

వచ్చినప్పటినుండియుఁ దన్ను లక్ష్యపెట్టనివారు, నాఁడు తనకుఁ బ్రదోన నిచ్చి గౌరవముజూపుట కేమికారణమో యని తనలోఁ దాను గొంతతడవు వితర్కించు కొనెను. అంత తంత్రజ్ఞునిచెంత కరిగి యమ్మవారికి కుంకుమను నొసటఁ బెట్టుకొని గుగ్గిలము ధూపము వైచి, బలి నర్పించుటకు ముందు, తల్లికి దండప్రణామ మొనర్చుటకై తలగుడ్డను నడికట్టు గట్టుకొని సాష్టాంగపడెను. అప్పుడుఁ 'గ్రామవిరోధి, గ్రామవిరోధి' యనువాక్యము లాగుంపులోనుండి వినవచ్చెను.

పగసాధింపు.

ఆక్షణముననే అమ్మన్నరెడ్డికంఠము బలి ఖడ్గమునకు సమర్పింపఁ బడెను. ఆభయంకర దృశ్యమును గాంచియెవ్వరును బల్లెత్తుమాటనేమియుఁ బలుకక యుండిరి. తరువాత నడుపఁబడవలసినవిధానమంతయు ముగింపఁబడినది. నడికేయి యగునప్పటికి అమ్మవారిని సాగనంపిరి. అమ్మన్నరెడ్డిజీవితసమాప్తముతోఁ గొలుపుగూడ సమాప్తి నొందినది.

రాత్రి చాల ప్రొద్దుపోయినను భర్తయింటికి రానందున నాగమ్మ తహతహ పడఁజొచ్చెను. ఎంతసేపటికి నాతని సమాచారమే తెలియకుండుటవలనఁ బొరుగింటి పిల్లవాని నొకని, నప్పుడే గుడిదగ్గరనుండి వచ్చియున్నందున, మీ తాతను జూచితివా నాయనా యని యడిగెను. వాఁడు మొదట నెందుకో సందేహించి తుదకుఁ దాతను గ్రామమణియరుగారిప్రోత్సాహమువలన నూరివారు చంపివేసినారని తెలియఁ జెప్పెను. వెంటనే నాగమ్మకు గుండె గుభిల్లు

మనియెను. నిజమా అబద్ధమా యని సంకోచించుచు నేమియుఁ దోచక వీథిలోనికిఁబోయెను. అచ్చట జనులు వచ్చువారును బోవువారునై చాల సందడిగా నుండెను. వారిలోఁ గొందఱుఁ 'పాపము పెద్దకాపు నన్యాయముగాఁ జంపివేసినారురా' యని పలువిధములఁ జెప్పుకొనుచుండిరి. నాగమ్మకు వారిమాటలన్ని యువినవచ్చెను. ఇంకేమున్నది? ఆమెకు పై ప్రాణములు పైననే లేచిపోయెను. ఒకటే యేడుపు. ఆమహాతల్లికి వృద్ధాప్యమున నైదువతనము తొలగిపోయినది. ఆమెయుసురు గ్రామస్థులకు గట్టి కుడుపకుండునా? ఆమె నోదార్చువా రొక్కరును లేకుండిరి. ఓయమ్మ ఓయమ్మ బాగుకొనుచు నాయర్థ రాత్రింబున మూర్తీభవించిన శోకదేవతవలెఁ గొడుకు లున్న

ఘోరప్రతిజ్ఞ. పొలమున కరిగెను. అచ్చోట వారును గొంత వఱకు జొన్నకోసి కొంతవిశ్రాంతికై కూర్చొని తీరికగా మాట్లాడుకొనిచుండిరి. దూరముననుండియే వారల కేడుపు వినవచ్చెను. కానియాకంఠమెవ్వరిదో రెడ్డికుమారులు గుర్తింపలేకపోయినను మాలదాసుమాత్రము వెంటనే 'అమ్మ యేడుపు వినవచ్చుచున్నది' అని కడునాత్రముతోఁ బలికెను. ఇంతలో నామె స్వరూప మందఱకుఁ గన్పడెను. నాగమ్మ కుమారులను దగ్గఱ, 'నాయనా! మీబాబును జిత్రవధ గావించినారురా నాయనా! అయ్యో! నాయనా! మీఅయ్య యింకలేడురా నాయనా! ఊళ్లోవాళ్ళపొట్టను బెట్టి నీళ్ళిడిచామురా నాయనా!' అనిపెద్దపెట్టున విలపింపఁదొడఁగెను. మాలదాసు నాగమ్మతల్లి మాటలు వినఁగానే మొదలునరికిన

తరువువలె స్మృతిదప్పి నేలఁబడిపోయెను. తక్కినవారలందఱు గోలగా నేడ్చుచుఁ బ్రికృతిని స్తబ్ధభావమును బెకల్చి వైచుచుండిరి; కొంతవఱకు రెడ్డికుమారు లేడుపు సాలించి యిక ముందు జరుగవలసినది యేమా యని విచారింపఁ దొడంగిరి. మాలదాసు కింకను దెలివికలుగ లేదు. నలిపోయి గిలిపట్ట నన్నట్లిది యేమిరా స్వామి యని రెడ్డికుమారు లాతనికై చింతింపఁ జొచ్చిరి. అప్పుడు "ఏమీ ? ఆ ! రక్తబలియా ! ఋణమా !" అను అస్పష్టవాక్యములు మాలదాసుని నోటినుండి యక్కడ నున్నవారలందఱకు వినవచ్చెను. అందఱును నివ్వెరగంది చూచుచుండిరి. ఎవ్వరో తట్టిలేపినట్లు అంతవఱకు స్మృతితప్పి పడియున్న మాలదాసప్పుడు చివాలున లేచెను. ముందునకై నను నాతనికంట నొకనీటిచుక్కయుఁ గనుపడకుండెను. ఆపండు వెన్నెలయందుఁ జూచువారలకుఁ జింతనిప్పులవలె నాతని రెండు నేత్రములు గన్పడుచు వెఱపు గలిగించుచుండెను. ఆతనిశరీరము నిలువెల్ల వణఁకిపోవుచుండెను. అందరు వినునట్లాతఁడు "పగసాధింపవలదా" యని భయంకరముగాఁ బలికెను. అదివరకే క్రోధాగ్నిచే మండిపోవుచున్న రెడ్డికుమారుల కా వాక్యము ప్రోత్సాహజనకముగా నుండెను. ఆనిశీథిసమయమున, నాజొన్నచేనియందు, ఆనాగమ్మతల్లి మ్రోల, నావీరకుమారపట్కము ప్రాణంబు లర్పించియేని పగసాధించుటకు సమయ మొనర్చెను. కారెమపూండి మారెమ కారెనుబోతుల రక్తము నేగాక, మానవులరక్తమును జవిచూడఁగోరియున్నది కాబోలు!

తెల్లవాఱినది. రక్తవర్ణముగ నెండపొడ కానవచ్చెను. రాత్రిజరిగిన కొలువువలన బడలిక జెందినవారును జెందని వారను నందఱును నప్పటికి బొమ్మరాయికడ కొక్కరొక్కరుగాఁ జేరుకొనిరి. ఆప్రొద్దు బండకడ గ్రామములోని పిన్నలు పెద్దలు యావదాస్తి గుంపుకట్టియుండిరి. గ్రామమణియరుగారును కరణమును గూడ వచ్చియుండిరి. రాత్రిజరిగిన కొలువును గూర్చియుఁ బెద్దకాపుదుర్మరణమును గూర్చియుఁ దదితరవిషయములఁ గూర్చియుఁ బలువురు పలుభంగుల ముచ్చటించుకొనుచుండిరి. ఆసమయమున నచ్చటికి

మరాలోచన.

మాలదాసు వచ్చెను. అప్పటి యాతని యాకారము కడు భయంకరముగా నుండెను. శరీరము కంపించిపోవుచుండెను. రక్తనాళములన్నియు నుబ్బి యుండెను. నాసాపుటంబులనుండి వేడియూర్పులు మెండుగా వచ్చుచుండెను. కన్నులెఱ్ఱబాఱియుండెను. కరమునం దొక కఱ్ఱమాత్రముండెను. అట్టి యాతనియాకారమును గాంచి కాపులందరు గొయ్యబొమ్మలవలె నిశ్చేతనులై యుండిరి. అప్పుడు మాలదాసు గ్రామమణియరుగారిని సమీపించి “గ్రామాధికారులను రెడ్డిగారిదుర్మరణమును గూర్చి విచారింపవలయు నని కోరుచున్నాను” అని పల్కెను. కాపులందరు మణియరుగారి నోటినుండి ప్రత్యుత్తర మేమి వచ్చునో యని చెవులు నిక్కించుకొని నిశ్శబ్దముగా నుండిరి. కాని ప్రత్యుత్తర మేమియు వినఁబడలేదు. మాలదాసు తిరిగి యావాక్యమునే కరణముగారి నడిగెను.

ఆతనివలనను దిరుగు జబాబు రాలేదు. తిరిగి యా మాటనే యాతడు అచ్చటనున్న కాపుల నడిగెను. ఎవ్వరును మాటలాడలేరు. ఆ సమయమున వెనుకనుండి యెవ్వరో మాలదాసుని రెండు చేతులను గట్టిగాఁ బట్టుకొనిరి. వా రెవ్వరో గాదు. గ్రామమణియము గారే. చేతులు వెనుకకు లాగి పట్టుకొనఁబడియుండుటవలనఁ బట్టు విడిపించుకొనుటకు మాలదాసునకు వీలు గాకుండెను. మణియముగారు దగ్గరనున్న వాని నొకని పగ్గము దెమ్మని పంపెను. పదుగురు పలువిధముల మాలదాసుని నోటికివచ్చినట్లు దిట్టుటయేగాక కొందరు మోకాళ్ళతోను మోచేతులతోను గుద్దుచున్నాగిరి. అట్టితరుణ మున నొకవ్యక్తి వెనుకపాటున నతిత్వరితముగావచ్చి గ్రామ మణియరుగారి బాహుద్వయమును దనఖడ్గమునకుఁ బ్రథమా హుతిగా సమర్పించెను. సింహము బోనులో నుండి బయటికి దుమికినది.

జనసమూహమునందుఁ గలవరపాటు జనించినది. అంద ఱొక్కుమారుగా లేచి కాలికి బుద్ధిసెప్పిరి. కాని యేవెపు చూచినను ఖడ్గహస్తులు గానవచ్చిరి. నాలుగు వైపులను భయంకరములగు గండ్రగొడ్డళ్ళను జేబూని రెడ్డి కుమారులు నల్వురు మార్గము నతికట్టియుండిరి. సభయందు మాలదాసుకత్తియుం దమర్పఁబడియుండిన నిశితకుఠారమును బయటికి లాగి ప్రథమాహుతిగాఁ గరణముగారి రక్తము సమర్పించెను. ఒకవంక రెడ్డిపెద్దకుమారుడు విజృంభించి యుండెను. పుర్రెలు బంతులవలె నెగిరిపోవుచుండెను. నెత్తురు

కలాపి భూమియందుఁ జల్లబడుచుండెను. ఆ స్థలమంతయు హాహాకారములతో మాఱు మ్రోయుచుండెను. ఇంతదనుక సరససల్లాపములు వినవచ్చినచోట రోదనధ్వనులు వినవచ్చుచుండెను. ఆనందము నాట్యము సల్పినచోట దుఃఖము

రక్తబలి.

చిందులు ద్రొక్కుచుండెను. నెత్తురుచుక్కలు మీఁదపడిః క్రిందనున్న మాలదాసునకు శరీరమే తెలియకుండెను. కాపులు నిరాయుధులై యుండుటవలనఁ బ్రతీకార మొనర్పఁజాలకుండిరి.

జాము ప్రొద్దెక్కెను. స్థలమంతయు పీనుంగులచేతను నెత్తురు బురదచేతను, మొండెములచేతను, గుయ్యో మొఱ్ఱో యని మొత్తుకొనువారలచేతను, జాల భయంకరముగా నుండెను. చేఁజిక్కినవారలందరు జితవ్రధ గావింపఁబడిరి. ఇంచుమించుగా నా ప్రదేశమంతయు నిర్జనమయ్యెను. అప్పటికా వీరపట్ట మొకచోటికిఁ జేరుకొనెను. రక్తబలి సంపూర్తి నొందెను. సమయ మొనర్చినవిధమున బగ సాధింపఁబడెను. కాని మాలదాసునకు రాళ్ళ దెబ్బలును, కఱ్ఱవిసరుదెబ్బలును, బలముగాఁ దగిలినవి. అదిగాక జరిగినరక్తబలివలన నాతనికి జ్వరము మిక్కుటముగా వచ్చినది. జాముప్రొద్దువేళకు వీరకుమారుఁడగు నాతఁడు తన వీరచారిత్రమును వెనుక విడిచి, వీరస్వర్గమును జేరుకొనెను. ప్రాణము లర్పించి స్వామిఋణమును దీర్చుకొనెను.

# 3. గోపరాయఁడు.

గీ॥ తనకు ముప్పగునంచును ♦ దలఁపఁబోఁడు
పరుల కెగ్గొనరింపఁగ ♦ భయము పడఁడు
తరుణికొఱకును విత్తంబు♦కొఱకు నరుఁడు
గనుక వర్జితము లని పే ♦ ర్కొనిరి బుధులు.

తిమ్మరాజు కాపురస్థలము మాచెర్ల. ఆగ్రామమున కతఁ డధికారి. తాను గ్రామాధికారి నికదా యని మిట్టిపడు స్వభావము గలవాఁడు కాఁడు. అధికారము చేతియం దుండె నని యాక్రమణముల నాసియు, గ్రామకంఠముల గూర్చి పైవారికిఁ దెలిపియు, లంచములఁ గొని యూరివారల బాధించియు మొదలగు పనులవలన జనులను గష్టపెట్టి యెఱుంగఁడు. శిస్తుపైకమును వసూలు చేయునప్పుడు గూడ బీద బిక్కనిఁ గనిపెట్టి పోవుచుండెడివాఁడు. గ్రామమున ఖాళీస్థలము లున్న యిండ్లు లేనివారలకు మంజూరు చేయించి యిచ్చుచుండెడివాఁడు. ఈగ్రామాధికారపుపదవి తిమ్మరాజునకుఁ దరతరములనుండియు వచ్చియున్నందునను, నతనిపూర్వులందరును గ్రామస్థుల కనుకూలముగనే తమ పనుల నెరవేర్చి యుండుటవలనను, నాతఁడును దనవంశీయుల కప్రతిష్ఠ రాకుండునట్లు కడుజాగ్రత్తతో వర్తించుచుండెడివాఁడు. స్వభావము ననుసరించి యాకారముగూడ దర్శనీయమైయుండెను. వంగపండుచాయవంటి శరీరము గలవాఁడు. కుఱుచమీసములును తెగ

బారెడు వెండ్రుకలును, దండలుగట్టిన బాహువులును, విశాలమైనయురమును, విస్తారాంసలోదంచితంబులగుపిక్కలును నాతని సౌందర్యమునకు వన్నె వెట్టుచుండెను. చూపుల కాతఁడు నలుబదియేండ్లకు మించియు మించనివానివలె నుండును. ఒకరికిఁ

తిమ్మరాజు.

బెట్టుటకుఁ దాను తినుటకు నెక్కు తొక్కు గావలసినంత భూవసతియుండెను. అన్నివిధముల చేతను నాతఁడు ప్రశంసనీయుఁడై యుండుటయేగాక గ్రామస్థుల కందఱకు మంచివాఁడై యుండెను. అందువలన నాతనికి గ్రామమునందు మంచిపలుకుబడి యుండెను.

రాగమ్మతల్లి తిమ్మరాజునకుఁ దగినభార్య. ఆమెకు షుమారు ముప్పదివత్సరము లుండును. ఆకారమున బక్కపలుచగా నుండును. మొగమున నెప్పుడును శాంతరసము తొణికిసోవుచుండును. చూపులయం దెల్లప్పుడును గరుణారసము తాండవ మాడుచుండును. ఆమె కాపురమునకు వచ్చిన క్రొత్తలలోనే యొక స్త్రీసంతాన మామెకుఁ గలిగెను. అదిమొదలు

రాగమ్మ.

తిరిగి యామెకు సంతానము కలుగలేదు. పుత్రసంతానమునకై యామె యెన్నియో వ్రతములాచరించినది. రాళ్లకు మ్రొక్కినది. పుట్టకు వారుపోసినది. గాలిసోకినదేమో యని భూతవైద్యులచేత బాగుచేయించుకొనినది. గృహ మచ్చి రాలేదేమో యని నవగ్రహారాధనము అన్నశాంతి మొదలగువాని నెన్నియో యాచరించినది. తుదకు విసిగి "నొసటఁ వ్రాసిన వ్రాలు కన్నఁ గలదా నూరేండ్లు చింతించినన్" అని తనకుఁ దానే సమాధానము

చెప్పుకొని యాకలిగిన యాఁడుబిడ్డయే యన్ని యని తృప్తిపడినది.

తల్లిదండ్రులు తమబిడ్డకు లక్ష్మీదేవమ్మ అనిపేరు పెట్టిరి. అన్నివిధములచేతను నాపసిబిడ్డ వారలకు సంతోషమును గూర్చుచుండెను. ఆపిల్ల కైదేండ్లు వచ్చునప్పటికే యక్షరాభ్యాస మొనర్పఁబడినది. నాటనుండి లక్ష్మీదేవమ్మ బడికి వెళ్ళుచుఁ జక్కఁగాఁ జదువుకొనసాగెను. ఒక్కనాఁడేనియు బడిఁకిబోవ నని తిరుగబడి పోరుపెట్టునది కాదు. తల్లిదండ్రులును సెనగపప్పుఁ బెట్టియు, సజ్జరొట్టె చేతికిచ్చియుఁ, గ్రొత్తపలకఁ గొనియిచ్చియు నిట్లనేకవిధముల నాబిడ్డకుత్సాహము గలిగించుచుండెడివారు. లక్ష్మీదేవియు నున్నగాఁ

లక్ష్మీదేవమ్మ.

దలదువ్వుకొని, ముందు కేతకి తమలపాకును, వెనుక చిన్నరాగిడి చంద్రవంకయు, జడమీఁద చామంతిబిళ్ళయు జెవులయందు జూకాలును బెట్టుకొని, బొందిలిపరికిణీ నొకదానిఁ గట్టుకొని, నడుమున సన్నని వెండి వడ్డాణమును బెట్టుకొని, యెడమచేతఁ బలక బలపమును బట్టుకొని, కుడిచేతియం దొకసజ్జరొట్టెముక్క నుంచుకొని, యడుగడుగునకుఁ గొద్దికొద్దిగాఁ దినుచు బొరుగింటి సుందరమ్మకడ కరిగి, 'యేంచేత్తుండావే ? చూడరాదంటె ? మూరెళ్లోరి పాపమ్మ ముందు పోద్ది. దానికంటె మనం ముందెల్లిసిరి చుక్క పెట్టించుకుందాం పోదాం దబ్బున రాయే' అని పిలుచుకొని, సుందరమ్మతోఁ గలిసి బడికి పోవుచున్నప్పుడు వీధిలోని యమ్మలక్కలందరా పిల్లను ముద్దుపెట్టుకొని

మెటికలు విరుచుకొనుచుండెడివారు. అప్పటి యాబాలిక రూపమును జూచి యానందించవలసినదేగాని, వ్రాసి యానందింపఁ జేయుట శక్యముగాదు. పదియేండ్లు వెళ్లు నప్పటికి, లక్ష్మీదేవమ్మకు విద్యాభ్యాసము ముగింపఁబడెను. అది మొదలింటిపనులయందు శ్రద్ధపుచ్చుకొని యామె తన తల్లికిఁ జేదోడుగా నుండఁజొచ్చెను.

కుమార్తెకుఁ బెండ్లియీడు వచ్చినది మొదలు తిమ్మరాజు—

"క॥ శ్రీయును గులమును రూపును
బ్రాయము శుభలక్షణంబు ♦ బాంధవ విద్యా
శ్రేయము గల వరునే క
న్యాయితుగాఁ జేయవలయు ♦ నధికప్రీతిన్."

అను సర్వజనసమ్మతమగు నాచారము ననుసరించి తగిన సంబంధమును గూర్చి విచారింపఁదొడంగెను. వరద రాజు, తిమ్మరాజు బావమఱది. బాల్యమునందే యతఁడు తల్లిదండ్రులు లేనివాఁడగుటవలనఁ దన భార్యయిష్టప్రకారము తిమ్మరాజు తన బావమఱదిని స్వగృహమునందే యుంచుకొని యాతని బాగోగులను జూచుచుండెను. వరదరాజుకూడ మంచితెలివితేటలు గలవాఁడు. చూచుటకుఁ జాలనందముగా నుండును. ఇంచుమించుగఁ దిమ్మరాజునకు సరితూగు భూవసతి గలవాఁడు. అతనికెవ్వరును నన్నదమ్ములు లేరు. బుద్ధికూడ మంచిదిగా నుండెను. దానికిఁదోడు పెండ్లికి దగిన యీడు నుండెను. అందువలనఁ దిమ్మరాజు లక్ష్మీదేవమ్మను వరద

రాజున కీయవలయు నని తలంచెను. తన తమ్మున కిచ్చుట రాగమ్మకుఁగూడ సంతోషకరమే గదా? తిమ్మరాజువైపు వారును, వరదరాజువైపువారును సంతసమునుగలిసి వివాహము నిశ్చయమొనర్చుకొనిరి.

అదిమొదలు వరదరాజునకు బావగారియిల్లు స్వంతమై పోయెను. ఎందును నాతనిమాట కడ్డములేదు. ఊరివార లందరును నాతనిఁగూర్చి మిక్కిలిగాఁ జెప్పుకొనఁ దొడఁగిరి. క్రమక్రమముగ నాతని కింటఁ జనువు హెచ్చినకొలఁది, గర్వమునఁ జేయుట నారంభించెను. వివాహము నిశ్చయమైన నాటనుండియు నాతని కొక విధమగు నహంభావత్వ మేర్పడినది. దీనికిఁదోడు చేతియందు ద్రవ్యము పుష్కలముగా నుండఁ జొచ్చినది. ఇంక చెప్పవలేమున్నది? అయ్యగారి బుద్ధి యమునగంటి పోవఁ జొచ్చినది. చేతియందు ధన మెంత యెక్కువగానున్న నంత చేటు జూదములును, త్రాగుడును మొదలగు చెడ్డయలవాటులు కలిగినవి. ఎంతవారినిఁగూడఁ దిరస్కారముగాఁ జూచుభావ మంకురించినది. కొట్లాటలు, పోట్లాటలు, నీతనివలన గ్రామమున మిక్కుటముగా జరుగఁజొచ్చినవి. తిమ్మరాజు పనువుఁగూడ పోవృస్థితి సంభవించునని తలంచెను. పాపము! ఆతఁ డేమి చేయఁగలఁడు? ఆతనికి శక్తి వంచనలేకుండ వరదరాజును సరియైనత్రోవకు ద్రిప్పవలయునని తిప్పలుబడుచునే యుండెను. అది యేమి మాయమో కాని, తిమ్మరాజుయత్నములవలన నయ్యది మఱింత ప్రబలము గాఁజొచ్చెను. ఒంటరిగా వరద

వరదరాజు.

రాజున కెంతయో బుద్ధి చెప్పెను. ఏవియు నక్కఱకువచ్చినవి గావు. వరదరాజువలన నొకటి రెండు హత్యలుగూడ జరిగినవని గ్రామమున వదంతి కలిగెను. నాఁడు మొదలు గ్రామమున కాతఁడు ప్రబలవిరోధి యయ్యెను.

తిమ్మరాజున కాతనియం దసహ్యభావము జనించినది. రాగమ్మకు దిగు లంకురించినది. లక్ష్మిదేవమ్మ కత్యుత్సాహము కలిగినది. ఇంతవఱకును నామె హృదయము వరదరాజువలన నాకర్షింపబడియుండ లేదు. ఆమెహృదయమును దొంగిలించిన వ్యక్తి యింతవఱకును దూరముగానే నిలిచియుండెను.

గోపరాయఁ డొక బీదకుటుంబమునకుఁ జెందినవాఁడు. వృత్తివలన నాతఁడు తక్కువగానున్నను, గుణమువలనఁ దిమ్మరాజునకు సరితూఁగినవాఁడు. గోపరాయుని తల్లిదండ్రులాగర్భదరిద్రులగుటవలన నెల్లప్పుడు కూలినాలి చేసికొని బ్రతుకుచుండెడివాఁడు. గోపరాయఁడు చేతి కక్కఱకు వచ్చినప్పటి నుండియు నాతని నే యయ్యాదగ్గఱనో, జీతమున కుంచుచుండెడివారు. అతఁ డున్నచోట మాటరాకుండఁ గడునేర్పుతో నుండెడివాఁడు. నడవడియందును, గుణమునందును, నమ్మకమునందును, బనినేర్పుదనమునందును గ్రామమున నంతటివాఁడు లేడనిపించుకొనెను. అందువలన గ్రామస్థులందరును 'మాదగ్గరంటే మాదగ్గర' నుండుమని యాతని బలవంతపెట్టుచుండెడివారు. తిమ్మరాజు, తనకు భూవసతి యెక్కుడుగానున్నందువలనను, దగినవాఁడు చేతిక్రింద లేకుండుటవలనను, నందఱికన్న నెక్కువ

గోపరాయఁడు.

జీతమిచ్చి గోపరాయనిఁ దనయింట నుంచుకొనెను. ఇంచుమించుగ నైదేండ్లనుండియు గోపరాయఁడు తిమ్మరాజుగారి యింటియందే నిలవరముగా నుండఁ జొచ్చెను.

ఆటవిడుపు దినములయందు లక్ష్మీదేవి గోపరాయనితోఁ గలిసి పాలమునకరుగుచుండెడిది. అతఁడును నాబిడ్డను నెత్తిన నిడికొని పూజించుచుండెడివాఁడు. పాలమునకు వచ్చినప్పుడెల్లను లక్ష్మీదేవి కాతఁడు జొన్నబియ్యము గొట్టిపెట్టియుఁ దంగేడుపూవులు కోసియిచ్చియుఁ బచ్చిదోసకాయలు మోసినన్ని యిచ్చియు ననేకవిధముల నామెను సంతోషపెట్టుచుండెడివాఁడు. లక్ష్మీదేవియు గోపరాయుఁడన్న నెంతయో సంతోషపడుచుండెడిది. ఆమె బడిచాలించినప్పటినుండియుఁ దల్లినిఁ గాదని తానే యామెకు బువ్వబెట్టుటయు, నీళ్లు దోడుటయు, స్నాన మొనర్చునప్పుడు వీపు దోముటయు, పొద్దగట్టి యిచ్చియుఁ దనవారికిఁ దెలియకుండ గుప్పెళ్ళకు గుప్పెళ్లు చుట్టుపొగాకుఁ బెట్టుటయు మున్నగునవి యొనర్చుచుండెడిది. పెద్దపిల్ల యైనప్పటికిని లక్ష్మీదేవి గోపరాయనియెడ నెప్పటివలెనే బ్రవర్తించుచుండెను. తుదకు వరదరాజునకు, గోపరాయనికి నేకబంతిని నన్నము బెట్టునప్పుడుగూడ, గోపరాయనికిఁ బిడతయెత్తి నెయ్యివేసి, వరదరాజునకు గంటెతో వేయుచు వలపక్షమును జూపించెడిది. అది గాంచి రాగమ్మ కోపపడినప్పుడు పొద్దస్తమానము కష్టపడిపనిచేసేవాళ్ళను బాగా చూడనక్కరలేదటే అని సమాధానము చెప్పుచుండెడిది. వరదరాజునకుఁ బట్టశక్యముగాని కోప

ము వచ్చుచుండెడిది. కాని రాగమ్మమాత్రము విషయము వెనక వేసికొని 'ఏదో లేరా? చిన్నపిల్లలే, దాని మొగంకాదూ' అని పల్కి సమాధానపెట్టుచుండెడిది. అన్నింటియందును వరద రాజునకు లక్ష్మీదేవివలనఁ దలవంపులు గలుగుచునే యుండి నవి. ఆమె గోపరాయనికి నీళ్లతోడి, స్నానమొనర్చినపుడు వీపుదోమి, యుదికిన పంచ నందిచ్చి యన్నివిధములఁ గడు శ్రద్ధతో జూచుచుండెడిది. వరదరాజన్న లేనిపోని సాకులుచెప్పి పొరుగింటికిఁ బోవుచుండెడిది. అప్పుడు 'నిన్ను జూచి సిగ్గుపడుతున్నది లేరా' యని రాగమ్మ యాతనిని సరిపెట్టుచుండెడిది. అప్ప యీవిధముగాఁ దన్ను సమాధాన పెట్టుచుండుటయు, బావ తనబిడ్డచేష్టల కుపేక్ష చేసి యేమనక యుండుటయు, గోపరాయని యెదుటఁ దనకుఁ బ్రతి

రాగలత.

రోజు నవమానమగుచుండుటయు, గాంచిన కొలది వరదరాజునకు మనస్సు తిరిగిపోవుచుండెను. బావమీఁదఁ గోపమును, గోపరాయనియందు మాత్సర్యమును, లక్ష్మీదేవి యందుఁ జులకనయు నాతని హృదయమున నాటుకొని పోయినవి. నాటనుండి యాతని క్రూరదృష్టి యంతయు గోపరాయని మొదల నిలిచియుండెను అతని నెటులైన నీలోకమునుండి తొలఁగింపవలయునని యే యాతని సంకల్పము. పాపము! గోపరాయని కిది యంతయుఁ దెలియనే తెలియదు. లక్ష్మీదేవి చర్యలన్నియు సేవకావాత్సల్య సంజనితంబు లని యెంచియుండెనే కాని యయ్యవి కేవలము ప్రణయభావ విలాససంజనితము లని యాతఁ డెఱుంగనే యెఱుంగఁడు. వరద

రాజు సూక్ష్మదృష్టికంతయు గోచరమైపోయెను. లక్ష్మీదేవి హృదయము గోపరాయనిపైఁ బరుగులిడు చున్నదని యాతఁడు గ్రహించెను. అతనిహృదయ మసూయాగ్రస్తమై పోయెను.

నాఁడు కృష్ణపక్ష చతుర్దశి. మొదలే చీకటిగానుం డెను. దానికిఁదోడు దట్టముగా మబ్బుపట్టియుండెను. రెండు గడియల ప్రొద్దుపోవునప్పటికి గోపరాయఁడు పొలమునుండి యింటికి వచ్చెను. వెంటనే యన్నము దిని యాతఁడు మా మూలుగాఁ బండుకొనుటకై యూరివెలుపలనున్న పశువుల కొట్టమునకు బయలుదేరెను. తిమ్మరాజు గ్రామాంతరమున కేగియుండుట వలనను, వరదరాజు తిరుపతిబోత్తై యుండుట వలనను, రాగమ్మ యాతని నింటికడఁ బండుకొమ్మని యడి గెను. లక్ష్మీదేవమ్మ తమకు భయమని పల్కెను. కాని యింటికడనున్న, గొట్టమున నెవ్వరు? ఎద్దులకు మేతవేయువా రెవ్వరును లేరు. అందులో నయ్యది యూరికి వెలుపల నున్నది. అందువలన గోపరాయఁడు వారిని సమాధానపెట్టి, పశువులశాల కరిగెను. లక్ష్మీదేవమ్మ హృదయ మెందుకో కళవళ పడసాగెను. చాలా ప్రొద్దుపోయినప్పటికి నామెకు నిద్దుర పట్టలేదు. అప్పటికి దాదాపుగ రాత్రి జామున్నర ప్రొద్దు గతించెను. గ్రామమంతయు నిశ్శబ్దముగా నుండెను. వీధులయందుఁ గుక్కలరచుచుండెను. రాగమ్మ గుఱ్ఱువెట్టి నిద్రపోవుచుండెను. అట్టి సమయమున నింటితలుపు దెఱచు కొని, చేత నొక లావుపాటికఱ్ఱ బుచ్చుకొని వరదరాజు మెల్ల

మెల్లగ వసారాలోనికి వచ్చెను. లక్ష్మీదేవమ్మ నిద్రపోయినట్లు నటించుచు నాతని చర్యలను దిలకించుచుండెను.

వీరలక్ష్మి.

అతఁడు నటు నిటు బారజూచి, వారు నిద్రించుచునే యున్నారను భావమున నిశ్శబ్దముగా వీధితలుపు దెఱచికొని యా కటికచీకటియందు లీనమైపోయెను. అతఁడరిగిన వెంటనే లక్ష్మీదేవి చివాలున మంచమునుండి లేచినది. శరీరమంతయు గంపించు చుండెను. వరదరాజు గోపరాజుపైఁ గత్తిగట్టియున్నాఁడని యాతనిచర్యలవలనఁ దెలిసికొని యున్నదగుటవలన నేమియు నాలోచింపక నిశ్శబ్దముగాఁదలుపును మూసి, యాతని వెంబడించెను.

అప్పటికి రెండవజాము కోడికూత వినవచ్చినది. ఎట్టయెదుట గంభీరాంధకారము. ఎల్లెడల నిశ్శబ్దము. గోపరాజు పశువులశాలయందు నిద్రించుచుండెను. ఇంతలో కిఱ్ఱుమను ధ్వనివలనఁ బెండెము గదలించినట్లు తెలియవచ్చెను. ఆధ్వని నాలకించి, చెంగటనున్న యెద్దులన్నియు నొకదానివెంట నొకటిగా లేచి, తోక లాడించుచుఁ దలలు గదలించుచు గోపరాయని నిద్రకు భంగ మొనర్చెను. అతఁడును గన్నులు నులుముకొనుచు లేచి యటునిటు జూచునప్పటికి మంచము దాపున గండ్రగొడ్డలిఁ జేబూని నిలిచియున్న వరదరాజు కానుపించెను.

హతవిధి.

గోపరాయనికి శరీరము జల్దరించినది. తలవని తలంపుగ నెట్టయెదుట సాయుధునిఁ గాంచిన నెంతవారికేనియు భయము పుట్టకుండునా? అతఁడు లేచుటయే తడవుగా వరదరాజు పండ్లు పటపట గొఱుకుచు

'క్రూరుఁడా!' యని శిగపట్టి క్రింది కీడ్చెను. పాపము! ఆతని కేమియుఁ దోఁచుటలేదు. నాటితోఁ దనకు సమాప్తి కాఁగల దని తలంచెను. చేతులుజోడించి 'నీయిచ్చవచ్చిన ట్లొనర్పు' మని యాతఁడు మౌనము వహించెను. వరదరాజునకుఁ గోప మినుమడించెను. ఒడలు తెలియని శివమున 'ఒక్కటే వ్రేటు' అని గొడ్డలి నెత్తెను. ఇప్పట్టున, దైవముకన్న గోపరాయుని కొండు శరణ్య మున్నదా? ఉన్నది. వీరలక్ష్మి శరణ్య మున్నది. అదిగో! వచ్చుచున్నది. అప్పుడు వెనుకపాటున నతి త్వరిత ముగ లక్ష్మీదేవి వరదరాజును మెల్లన డగ్గరి, బలమునంతయు వినియోగించి యెత్తిన కుఠారము నెత్తినట్లు లాగివైచినది. స్త్రీ సాహసించిన నలవిగాని పనియొక టున్నదా? వరదరాజు వెనుదిరిగి చూచునప్పటికి లక్ష్మీదేవి యగుపడెను. క్రోధో ద్రేకమున శరీరము కంపించుచుండ 'ఓసీ! పిశాచీ!' యని యాతఁడామెపైకి లంఘించెను. గోపరాయుని కింక భయముదీరి నది. తనయజమానుని పుత్రికపైకి లంఘించు నాక్రూరుని నొక్కపెట్టున వెనుకకు గుంజివైచి యాతనితోఁ జెయ్యికలి పెను. వరదరాజు బలవంతుఁడైనను ద్రాగుబోతగుటవలన గోపరాయునికి జవాబుచెప్పుటకుఁ జాలకుండెను. గోపరాయుఁ డాతనిమీఁద దబదబ గుద్దులవర్షమును గురిపించి, జనపనార పగ్గముతో నాతని బంధించివైచెను. లక్ష్మీదేవి కప్పు డూపిరి యాడఁజొచ్చెను. కంపితస్వరముతోఁ బ్రతికితివా గోపరాయా యని యామె యాతనిచేతులను బట్టుకొనెను. ఆతఁడును కృత జ్ఞతాసూచకముగా పల్నాటివీరలక్ష్మిసాహాయ్యమున జీవింపఁ

నాఁడగుటవలన నప్పటికై దాదాపు దినములనుండియే తోటలను గోయించుచుండెను. గోపరాయనికిఁ దీనికయే లేకుండెను. కోత చాలవఱకు కడుగుబట్టినది. కాని యింకను రెండు తోటలు మిగిలియే యుండెను. పదవనాఁడు జాముప్రొద్దెక్కునప్పటికే తిమ్మరాజు కూలివాండ్రను దీసికొని యూరికి దాపుననున్న తోటను గోయించుట కరిగెను. గోపరాయఁడుకూడ కూలివాండ్రతో దూరపు పొలమున కరిగెను. ప్రొద్దుగ్రుంకు నప్పటికిఁ గోత సమాప్తి నొందెను. కూలివాండ్రందరు వెళ్ళిపోయిరి. తిమ్మరాజు గోపరాయనికై యెదురు చూచుచు పొలము గట్టున కూర్చుండియుండెను. అప్పుడప్పుడే చీకటి నలుదిక్కుల వ్యాపింపఁ జొచ్చెను. ఆకసమంతయు సంధ్యారాగంబువలన నెఱ్ఱబాఱి యుండెను. భూప్రదేశమంతయు ఎఱ్ఱగాఁ బండియున్న మిరపతోటలతోను, నచ్చటచ్చట నారబోసిన మిరపకళ్లములతోడను, జూచువారలకు రణరంగమా యనునట్లుండెను. కను చీకటి బాగుగాఁ బడినది.

పాముఁబోసి పెంచినపాము.

గోపరాయఁడింకను రాకుండెను. అతనికై తిమ్మరాజట్లే వేచియుండెను. పొలమున నొక్కపురుగును లేకుండెను. చీఁకటి ప్రబలమయ్యెను. ఒకరి మొగ మొకరికిఁ గాన్పించుట లేదు. గోపరాయఁడు రాలేదేమా యని తిమ్మరాజు తహతహపడసాగెను, అట్టియెడ నచ్చటి కెవ్వరో యతిత్వరితముగ వచ్చుచున్నట్లు సడియయ్యెను. తిమ్మరాజు లేచి పాఱఁజూచెను. ఆవచ్చువ్యక్తి యెవ్వరో గుర్తింపఁజాలకపోయెను.

ఇంతలో బుజమున గండ్రగొడ్డలిఁ బెట్టుకొని, వరదరా జతనిని సమీపించెను. తిమ్మరాజు తత్తరపడసాగెను. కరచరణాదులన్నియు వణకసాగెను. తుదకు నోట మాటలేకుండఁ బోయెను. అప్పుడు వరదరాజు పండ్లు గొఱుకుచుఁ గన్నులెఱ్ఱజేసి 'ఏమి బావా! నాకుఁ బిల్లనీయక గోపరాయుని కంటగట్ట నెంచితివా? నేటితో నాకష్టములును, మీపాపములును బరిసమాప్తి నొందగల' వని కఠినముగాఁ బలుకుచు బలము కొలఁది గొడ్డలి నాతనిపైకి విసరెను. ఒక్కచేవ్రేటు తిమ్మరాజు క్రిందబడిపోయెను. కాని చావలేదు. విసరునప్పుడు గొడ్డలి తిరిగిపోయి మొనదెబ్బ బాగుగాఁ దలకుఁ దగిలెను. అంతవఱ కక్కడ బెత్తిక లేచిపోయెను. రక్తము గొట్టమున గొట్టినట్లు బుస్సున పైకి వచ్చుచుండెను. ఆనెత్తుటియందు దొడలు తెలియక తిమ్మరాజు మూర్ఛపడియుండెను.

## ఘోరము! అతిఘోరము!

తిమ్మరాజు చచ్చిపోయెనని వరదరాజు తలంచెను. తక్షణముననే మొగదల పొలమునన్న గోపరాయనికై బయలుదేరెను. అక్కడ గోపరాయఁ డప్పుడే పొలముపని నంతయు ముగించుకొని, యింటికి రావలయు నని మేతగట్టుకొనుచుండెను. ఆసమయమున నాతని కడుగులచప్పుడు వినవచ్చెను. పని వదలిపెట్టి యాతఁడు గట్టునకు వచ్చిచూచెను. చేతియందు మాత్ర మొక లావుపాటి కఱ్ఱయుండెను. ఇంతలో వరదరాజు గండ్రగొడ్డలి చేఁబూని యాతనిని సమీపించెను. ఈమారు మాత్రము గోపరాయఁడు భయపడలేదు. 'దండం

దశగుణం భవేత్’ అనునట్లు పగతుని దండించుటకుఁ దగిన దండ మతనికడ నున్నది. వరదరా జెక్కువగా మాటలాడ లేదు. ‘ఇఁక తప్పించుకొనజాల’ ననువాక్యము మాత్రమాతని నోటినుండి వెలువడినది. ఆక్షణముననే తీవ్రకోపంబున నాతనిపైకి గొడ్డలి విసరెను. గోపరాయఁ డేమరుపాటున నుండలేదు. ఆతఁడు గొడ్డలిని విసరినంతనే గోపరాయఁడు తన కఱ్ఱను నడ్డముపెట్టెను. గొడ్డలి కఱ్ఱయుఁ దిరుకుకొని పోయెను. దానివలనఁ గఱ్ఱయు గొడ్డలియు వారిహస్తములనుండి బెడిసి దూరముగాఁ బడిపోయెను. అంతటితో వరదరాజునకు నిరుత్సాహమును గోపరాయని కుచేష్టమును గలిగెను. ఇఁక చెప్పిన దేమున్నది! వరదరాజునకు నెముకలన్నియు గుల్లయై పోయినవి. గోపరాయఁ డాతని నిష్టమువచ్చినట్లు మోకాళ్లతోను మోచేతులతోను పొడిచి వదలిపెట్టినాఁడు. ఆ! వదలిపెట్టుటయే? మోపు తాటితో బంధించి, యొంటెఁడే చొప్పమోపనుకొని, తిమ్మరాజు పడియున్న స్థలమునకు మోసికొని వచ్చెను.

తానొకటి దలచిన దైవ మొకటి తలచును.

తిమ్మరాజునకింకను స్మృతి కలుగలేదు. నెత్తురింకను గాయమునుండి ప్రవహించుచునే యుండెను. ఆ దృశ్యమును గాంచినంతనే గోపరాయనికి గుండె పగిలిపోయెను. ‘ఓరి మూఢుఁడా! ఎంతపని జేసితివిరా?’ యని తీవ్రకోపమున వరదరాజును నొక్కనారిగాఁ గ్రిందఁబడవైచి, చెంతనున్న కుంటలోని చల్లని నీళ్లదెచ్చి, తిమ్మరాజు మోముపైఁ జల్లి

పై గుడ్డను జింపి గాయమునకుఁ గట్టుగట్టి నెత్తురుప్రవాహమును గొంతవఱ కాపి, యాతని కుపచార మొనర్చుచుండెను. కొంతవడికిఁ దిమ్మరాజు తెప్పిరిల్లి కనులు దెఱచి గోపరాయని గాంచి 'గోపరాయా! బ్రతికియుంటివా? ఏడీ ఆ నరహంతకుఁడు?' అని యుచ్చరించెను. ఇంటియందు రాగమ్మ మొదలగువారు, తమవా రింకను రాలేదేమా యని సమాచారముఁ దెలిసికొని వచ్చుటకై యొకనిఁ బంపిరి. అతఁడు వచ్చునప్పటికిఁ దిమ్మరాజు నీరసముతోఁ బడియుండెను. గోపరాయనివలన సమాచారమంతయు నాతఁ డెఱింగి, యొక్కఁ డఱుగున నింటి కరిగి జరిగినదంతయు వారల కెఱింగించి, బండిఁ దోలుకొని పోయెను. ఇల్లంతయు నేడ్పులతో నిండిపోయెను. ఊరివా రందరు గుంపులుకట్టి పొలమునకుఁ బోయిరి. రాగమ్మ మనస్సు చివుకుమనెను. తమ్మునిపై విరక్తి గలిగెను. అతి పనిన మండిపడనాగెను. ఇంతలో బండిపూఁదఁ దిమ్మరాజును గృహమునకుఁ జేర్చిరి. గోపరాయఁడు దుష్టుని బంధించి తీసికొని వచ్చెను.

పట్టుకొమ్మ విరిగెను.

కొన్నిదినములు గడచినవి. తిమ్మరాజునకుఁ దిరిగి యారోగ్యము గలుగ నారంభించెను. నెలదినములు గతించునప్పటి కాతనికి సంపూర్ణారోగ్యము గలిగెను. కాని మనసెప్పుడును క్రోధానంబులచే దహింపఁబడుచునే యుండెను. వరదరాజుపై నాతనికిఁ గలిగిన కోపావేశ మాతనిప్రాణాపహారణంబువలన శాంతి నొందునట్లు కనుపట్టుచుండెను. వరదరా

ఇంటివారికేగాక యూరివారి కందఱకును బ్రబలశత్రువుగఁ గాన్పించుచుండెను.

**దుష్టశిక్షణము.**

పాపవృక్షమిప్పటికిఁ బండినది. ఇన్నినాళ్ళనుండియు నాతఁడు దిమ్మరాజు నింటఁ గారాగృహవాస మనుభవించుచునే యుండెను. రాగమ్మ కాతనిపొడయే గిట్టకుండెను. తనభర్త నెత్తురుగంటఁ జూచిన యాపాపాత్మునిఁ బ్రాణములతో విడువఁగూడదని సంకల్పించుకొనియుండెను. లక్ష్మీదేవమ్మ మామూలుగనే యుండెను. ఊరివారందఱొకవేళ బావమఱది యని వరదరాజును విడిచి పుచ్చినను, దా నుపేక్షచేయఁగూడదనియు, బంధుద్రోహియు, స్వామిద్రోహియునగు నాతనివలనఁ దమకు ముందెప్పుడేనియు హానికలుగక మానదనియుఁ గాన నతని సమూలముగా నశింపఁజేయవలెననియుఁ గృతనిశ్చయులై యుండిరి. కాని "కావలసినపని గంధర్వులే తీర్తు"రన్నట్లు తిమ్మరాజే యాపనికిఁ బూనుకొని యుండెను. ఒకనాఁడు గ్రామాధికారియగు తిమ్మరాజు, పురవాసులందఱి యెదుట వరదరాజును విచారించి యాతనికి మరణదండనము విధించెను. రాగమ్మ దాని నెఱింగియుఁ గంటఁ దడి పెట్టలేదు. కులసతీమణులకుఁ దమ పతులకన్న ప్రియులగు వారొక్కరేనియు నుండరుగదా? దండనము విధించిన ప్రకారము, మఱునాఁడు వరదరాజును నూరి వెలుపలనున్న వేపచెట్టునకు వ్రేలాడ దీసిరి. నాటితో మాచెర్లకుఁ గష్టము లంతరించి పోయెను.

తిమ్మరాజునకు మనస్సు స్థిమితపడెను. లక్ష్మీదేవమ్మ గోపరాయనిఁ బ్రేమించుచున్న సంగతి యాతనికిఁ జక్కగాఁ

తెలియవచ్చెను. అందు నాతఁ డెంతమాత్రము కుమార్తెను గోపింపలేదు. గోపరాయుని సచ్చరిత్రము తనకే

సుఖజీవనము.

కాక, యూరివా రందరకును తనుప్రియమై యుండుటవలనను, నాతఁడును భూవసతియందు దప్ప తక్కిన వారియం దన్నిఁటను దనకు సరిసమైనవాఁ డగుటవలనను, దన ప్రాణమును రక్షించినవాఁ డగుటవలనను, దిమ్మరా జతనికిఁ దన యేకపుత్త్రిక నిచ్చి యతివైభవముతోఁ బెండ్లికార్యము జరిగించి యాతనిఁ దనయింటనే యిల్లటముగా నుంచుకొనెను. నూతనదంపతు లనుకూలదాంపత్యమువలన సుఖజీవనము నొందియుండిరి.

# ౮. హరిదాసు.

సీ॥ సకియవలననె మృత్యు వాసన్న మగును,
సకియవలననె ప్రాణరక్షణము జరుగు,
సకియవలననె ధర్మానుసరణ మొదవు,
మనుజున కని తెలిపినవా రనఁగ వినమె?

హరిదాసు నివాసస్థానము గుత్తికొండ. అతని పేరే మియో యెవ్వరికిని దెలియదు. అతని వృత్తివలన నందఱా తనిని హరిదాసనియే పిలుచుచుండిరి. ఈతనికి భూవసతి యేమియును లేదు. మొదటినుండియు నీతఁడు ధనుర్మాసమందు గ్రామసంచార మొనర్చుచు సంవత్సరగ్రాసమునకు దక్కువగాకుండునంతటి ధాన్యమును సంపాదించుకొనుచు సుఖజీవన మొనర్చుచుండెడివాఁడు. ఆకారము బహుచక్కగా నుండెను.

హరిదాసు.

శరీరము సువర్ణచ్ఛాయను మించియుండెను. మంచి తలకట్టుగలవాఁడు. ధనుర్మాసమునందు ప్రతిరోజు ఉషఃకాలముననే స్నానమొనర్చి, జారుముడి వైచుకొని చక్కని గౌను దొడిగికొని, కాళ్ళకు గజ్జెలుకట్టుకొని, తంబురమీటుచు, శ్రావ్యతర కంఠంబునఁ జక్కని గీతములను బాడుచు, నాతఁడు బయలుదేరినంతనే ప్రతివారును బడలికయును వదలి, యాతని కొంత లేదన్న నరసోలెడు గింజలకుఁ దక్కువగాకుండఁ బెట్టుచుండెడివారు. ప్రతిగ్రామమందును నక్షయపాత్రి యించుమించుగఁ బది తడవలు

చించుచుండెడిది. గుణ్ణికొండయుం డెదెపెన్న నెయ్యురు గౌర వముతోఁ జూచుచుండెడివారు. ఆతఁడును బ్రతిదానికి 'అమ్మ, అయ్యా' అని పిలుచుచు నెంతో యణకువతో నుండెడివాఁడు. రాత్రిపూట కాపులందరితోవలన హరికీర్తనామృతమును గ్రోలుచుండెడివారు.

శ్రీదేవమ్మ హరిదాసుని భార్య. శరీరచ్ఛాయయందును భర్తను మించియుండుననియే చెప్పవలయును. ఆగ్రామమున నాకాలమునయున్న యువతులందఱికన్నను, నీమెయే చక్కనిదని యెల్లరును జెప్పుకొనుచుండెడివారు. సుమా ఇరువది యైదేండ్ల యీడున నుండెను. హరిదాసుగూడఁ దగిన వయస్సుగలవాఁడై యుండుటవలన వారి యెడ ననుకూలదాంపత్యము నిలిచియుండెను. పొలముపను లెక్కయును లేకుండుటవలన శ్రీదేవమ్మ యెల్లప్పుడు నింటికడనే మసలుచు, రాట్నము నడుపుచుండెను. ఇదియే పల్లెటి వాసులయందున్న నిరాడంబరత్వము.

శ్రీదేవమ్మ.

క॥ ……………………

………ర ధు …న ● నేనుల …సున్

వసుధేశుఁ…న మున్నను

గుసుమాస్త్రు…న ● జొన్నకూటి …మున్.

అను వచన మిప్పటికిని సార్థకముగనే యున్నది.

శ్రీదేవమ్మ సహజ సౌందర్యవతియగుటవలనఁ గొంద ఱకుఁ గన్నెఱ్ఱగా నుండకపోలేదు. అట్టివారిలో నరసరాయఁడు

మొదటివాఁడు. ఇతఁడు మంచి చూపరి. వాక్చాతుర్యమున మిక్కిలి ప్రవీణుఁడు. చాలినంత ద్రవ్యము గలవాఁడు. ఇంచుమించుగ ముప్పదియేండ్లు గలవాఁడు. కొంచెము కుఱుచగను బక్కపలుచగను నుండును. కంటికి నచ్చిన యువతి యాతని దృష్టిపథమునఁ బడినయెడల, వలసినంత ధన మొసంగియో, బలాత్కరించియో, చెరుప యత్నించు స్వభావముగలవాఁడు. ఇదియే యాతనియెడల నున్న దుర్గుణము. తక్కిన గుణములన్నింటియందుఁ గొనియాడఁ దగినవాఁడై యుండెను. శ్రీదేవిని గాంచినప్పటినుండియు నాతనికిఁ బిచ్చియెత్తినటు లుండెను. అనేకవిధముల యత్నించిచూచెను. కాని నిరుపమాన పతిభక్తియుతయగు శ్రీదేవి యాతనిఁ గన్నెత్తియేనియుఁ జూడకుండెను. కాని యాదురాత్మునివలన అప్పు డేమి కీడుమూడునో యని యాపతివ్రతామతల్లి భయపడుచునే యుండెను. సాహసించి యొంటరిగ బయలునకు వెళ్లుటకుఁ గూడ నామె శంకించుచుండెను. మానినీశిరోమణులకుఁ బ్రాణముకన్న మానమే ఘనము కదా! రాత్రిపూట హరిదాసింటికడనే యుండుటవలనను, బొగ్గవోవువరకుఁ గాపులందఱాతని యింటిచుట్టు మసలుచుండుటవలనను, వీలుపడక యున్నందున, నరసరాయఁడు తగిన సమయమునకై వేచియుండెను.

నరసరాయఁడు.

కాలము దుర్మార్గులకే యనుకూల మగుచుండును. నాఁడు ముక్కోటిపండుగ. గుత్తికొండబెళస్నానము సుప్రసిద్ధమైయుండుటవలన స్నానార్థమై చుట్టుపట్టుగ్రామములనుండియే

గాక దూరపు భూములనుండియుఁ బెక్కుమంది జనులు వచ్చియుండిరి. ఇఁక గుత్తికొండనుగురించి చెప్పున దేమున్నది? అయ్యది ధనుర్మాస మగుటవలన హరిదాసు మామూలు ప్రకారము పెందలకడనే లేచి భార్యాసహితుఁడై బెళస్నాన మొనర్చి, స్వగ్రామమును గలయఁదిరిగి, సంపాదనార్థము చుట్టు

దురాలోచనము.

పక్కలనున్న గ్రామములకరుగుచుఁ దానా నాటిరాత్రికింటికి వచ్చుట యసంభవ మగునే మో యని భార్యతో భద్రమని చెప్పి వెడలిపోయెను. హరిదాసుసమాచారమంతయు నెఱింగియున్నవాఁ డగుట వలన, సరసరాయఁడానాఁడు తన వాంఛితము నెఱవేర్చు కొనవలయు నని కృతనిశ్చయుఁడై యుండెను. ముక్కోటి పండుగ యగుటవలన నాఁడు హరిదాసునింటిప్రక్క నున్న వారందరు, రాత్రికి గ్రామసావడియందు జరుగనున్న హరికథ కరుగుదురనియు నందువలనఁ దన కెట్టియిబ్బందియు సంభవింప దనియు నాదుష్టచిత్తుఁడు తలఁచియుండెను. దుర్మార్గులతలంపు లిట్టులనేకదా యుండునది? ఆకాశహర్మ్యనిర్మాణమునందే వారిబుద్ధికుశలతయంతయు వినియోగింపఁబడును.

రాత్రి దాదాపు జాముప్రొద్దు గడచెను. ఊరివారందఱును హరికథాకాలక్షేపమున మెలంగుచుండిరి. శ్రీదేవికిఁ దానుగూడ నరుగవలయు నని యున్నది. కాని భర్త యింటి యందు లేకుండుటవలన నిల్లు వదలిపోవుట కామెమన సొప్పకుండెను. తనభర్త నాటికి రాఁడనుకొని భర్తవలెనే యామెయు నేకాదశీవ్రతదీక్షాపరతంత్రురాలు గనుక యింటి

ముంగిటఁ జాపవైచుకొని యాత్మధ్యాన మొనర్చుకొనుచుఁ బండుకొనెను. అప్పటికి షుమారు నడిరేయి కావచ్చినది. పలుకరించుట కిరుపొరుగువా రెవ్వరును లేకుండిరి. గ్రామ సావడియందు జరుగుచున్న గోవిందధ్వనులు, కథకుని రాగాలాపములు చక్కగా వినఁబడుచుండెను. అంతయును

**మానభంగ ప్రయత్నము.**

నిశ్శబ్దముగా నుండెను. శ్రీదేవి యాత్మధ్యానమున నిమగ్నయై యుండెను. అట్టియెడ నెవ్వరో వీధితలుపుఁ దట్టిన ట్లయ్యెను. ఆమె వెంటనే తనభర్త వచ్చినాఁడని గంపెడాసతో నరిగి తలుపును దెఱచెను. ద్వారమునన్నున్న యావ్యక్తిని గాంచినంతనే యామెకు గుండె గుభిల్లు మనియెను. 'అయ్యో దేవుఁడా!' యని యామె కెవ్వున కేకవైచి తలుపును బలవంతముగా మూయ నుంకించెను. కాని యావ్యక్తి ఆ నవసరాయఁ డొక్కమొగి లోనఁ బ్రవేశించి, తలుపునకు లోపలి గడియ వైచి నిర్భయముగ నిరంకుశముగ నామె హస్తద్వయమును బట్టుకొనియెను. వెనువెంటనే యా సాధ్వీమణి మూర్తీభవించిన కాళికావతారమువలె విజృంభించి 'ఛీ! దురాత్ముఁడా!' యని యొక్కపట్టున నాతని విదల్చివైచెను. ఆనీచుఁ డంతటితో నూఱకొనక, వీధితలుపు దెరువ నుఱుకుచున్న యాపరమపతివ్రతాశిరోమణి పయ్యెద చెఱగుఁ బట్టి వెనుకకు లాగఁదొడంగెను. ఆమె పెనగులాడినది. పయ్యెద చినిగి పట్టువిడిపోయినది. అరచినప్పటికి నామె మొఱాలకించువారు లేకుండిరి. ఆక్రూరుఁ డామెను విడువలేదు. వెంట

నంటి యామెను బట్టుకొని తన బాహుద్వయమున నిరికించుకొని 'పిచ్చిదానా! ఇంత యాగడ మేల?' యని ముద్దుబెట్టుకొనఁబోయెను. ఆమె గోళ్ళతో నెత్తురంట రక్కినది. పండ్లతోఁ గొఱికినది. బాహుబంధనమునుండి విడివడుట కెంతయో ప్రయత్నించినది. కాళ్ళతోఁ దన్నినది. నోటికివచ్చినట్లు దిట్టినది. ఆతని కది తగనిపని యని బోధించినది. కాని యవి యానీమన కొక లెక్కయా? ఆదుర్మదాంధుని చెవుల కామె హితవాక్యములు వినబడఁ గలవా? ఆతనియెడ నామె సాహస మక్కఱకు వచ్చినది కాదు. ఆకిరాతుఁడు పట్టు విడువ లేదు. సహజముగ నబల యగు నామె యేమి చేయఁగలదు? ఆమెకుఁ గన్నులు తిరిగిపోవుచుండెను. స్వరము సన్నగిల్లెను. తుదకు స్మృతిదప్పి చటుక్కున నేలపైఁ బడిపోయెను.

ఇంటియందు భార్యయొక్కతెయే యున్న దని, హరిదాసు గ్రామసంచారమును త్వరలో ముగించుకొని యెటులైన రాత్రి కింటికిఁ జేరవలయు నని సంకల్పించుకొనియుండెను. కాని యెంత యత్నించినను తుదకుఁ జీఁకటిపడి యాతఁడు బయలుదేరునప్పటికి జాముప్రొద్దు గతించెను. అయినప్పటికి నాతఁడు లక్ష్యముసేయక, మార్గము చిరపరిచయ మగుట వలన, నడిరేయికి స్వగ్రామమును జేరుకొనియెను. ఆతఁడు తనయింటి సందుమలుపునకు రాగానే, శ్రీదేవి రుద్ధకంఠస్వరమును, రోదనధ్వనియును నాతనికి వినవచ్చెను. వినినపాటుననే యాతఁడు నిర్భ్రాంతచేతస్కుఁ డయ్యెను. నిశ్శబ్దముగ నడుగులు వడివడిగ నిడుచు, నిజగృహబహిర్ద్వారమున డాసి, తలుపు

దుష్టశిక్షణము.

బెజ్జములగుండ దొంగిచూచెను. హరిదాసునకు గుండె బ్రద్దలయ్యెను. శ్రీదేవి స్మృతిదప్పి కటికనేలపై బడియుండెను. ఒక యపరిచితపురుషుఁ డామెను మాటిమాటికి స్పృశించుచుండెను. హరిదాసునకుఁ గోపము ప్రజ్వరిల్లిపోయినది. శివమెత్తినచందమున శరీరము కంపింప సాగెను. అటు లగుట సహజమేకదా! అట్టిపుణ్యదివసమున పుణ్యచరిత్రయగు నిజసతీమణికి, హృదయమునకు నచ్చినయట్టి ప్రియసతీమణికి, పతిదీక్షాపరతంత్రురా లగు కులాంగనకు, నాయర్ధరాత్రంబున ఒరు లెవ్వరు నింటలేనియెడ ఒక నీచుని వలన ఒక దురాత్మునివలన ఆనరసరాయునిమూలమున దనకన్నులయెదుట మానభంగ మగుచుండఁ జూచి భర్త యగువాఁడు, తుదకుఁ బిరికివాఁడే యగుఁగాక సహించియుండఁగలడా? హరిదాసు పిరికివాఁడు గాఁడు. కేవలము మానధనుఁడు. అందు నిరుపమాన మగు శరీరబలము గలవాఁడు. ఆతఁ డేమాత్రము చప్పుడుగాకుండ గోడ కెగఁబ్రాకి యింటిలోనికి దుమికెను. నరసరాయునికుటిలప్రయత్న మాతని కన్నులకుఁ బొడకట్టెను. మఱుక్షణముందే యాకన్నులగ్నికణము లై పోయెను. అబ్బ! అప్పటి యాతని మానసోద్రేకమును వర్ణింపఁజాలము. వెనుకపాటుల నా నీచుఁ డాసి, యొక్కటే తన్ను దన్నెను. నరసరాయఁ డాతన్నునకు బొక్కడు మన్ను దిని, తెప్పరిల్లి, చివాలున లేచి, మొలను డి పిడికత్తిని లాగి హరిదాసుపైకి నురికెను. ఏమి యాదురాత్ముని సాహసము? పతివ్రతామానభంగమునకేగాక, పరప్రాణాప

హారణంబునకుఁ గూడ సిద్ధపడియుండెను గదా ? అటులఁ బైకివచ్చు నరసరాయునిఁ గాంచి హరిదా సేమాత్రమును భయపడలేదు. తన ప్రాణమునకు ముప్పుగలుగునేమో యని యావంతయు శంకింపలేదు. నిరాయుధుఁడయ్యు నాతని నెదుర్కొని, కత్తిగల హస్తమును దన రెండుచేతులతో బలముగా బట్టుకొనెను. ఇఁక విడువలేదు. నరసరాయఁ డెంతో యత్నించెను. కాని విడిపించుకొనుట దుస్సాధ్యముగా నుండెను. ఆతనికిఁ గోప మినుమడించెను. హరిదాసుని నత్తువకొలఁది తన్న నారంభించెను. రెండవచేతితో బరుకఁ దొడంగెను. కాని యవి యన్నియు హరిదాసు నెడలఁ బనిచేసినవి కావు.

ఆనీచుని వికారపుచేష్టలవలన హరిదాసునకుఁ గోపము చెలరేగెను. సహనభావ ముడుగంబెను. ఆతనిహస్తమును బలవంతముగా వెనుకకుఁ ద్రిప్పి, యాబాకును నరసరాయుని చిరుదొక్క కానునటులఁ జేసి, 'నీచుఁడా! నేటితో నీ కాయువు సరి' యని వికటాట్టహాస మొనర్చుచు బలముగా నదిమి వైచెను. పిడివఱకు కత్తి యామనుష్యుని చిరుదొక్కయందు దిగిపోయెను. పాపునకుఁ దగినశిక్ష కలిగెను. నరసరాయఁడు విగతప్రాణుఁడై నేలపైఁ బడిపోయెను.

తెల్లవాఱినది. హరిదాసు నింట హత్య గావింపఁబడె నని యప్పుడే గ్రామమం దంతటను దెలియవచ్చెను. జనులందరు గుంపులుగట్టి వచ్చి చూచిపోవుచుండిరి. హరిదాసు నింటిదగ్గర నొక తిరునాలమాదిరిగా నుండెను. 'గాడిదకుఁ దగిన శాస్తి జరిగినదిలే' యని కొందఱును, 'పాపము! దుర్మరణమురా'

యని కొందఱును జను లిచ్చవచ్చినట్లు ముచ్చటించుకొను చుండిరి. శ్రీదేవి యాకారమును జూచినవా రందరును గంటఁ దడిపెట్టుచుండిరి. ఆ చిక్కువడిన శిరోజములును ఆ చినిఁగి పోయిన పయ్యెదయు ఆశరీరము నంటుకొనియున్న దుమ్మును మొదలగునవి యన్నియు నామెకు నాటికి జేయఁగలిగిన యపచారమునుగూర్చి చెప్పకయే చెప్పుచుండెను. ఊరి యాఁడువారందరును నామె నోదార్చుచుండిరి. హరిదాసున కింకను గోపము తగ్గలేదు. చూచువారల కాతఁ డుద్ధతునివలె గనబడుచుండెను. ఏమియుఁ దెలియని మూఢులు 'అడుక్కొని తినేవాడికిఁగూడ నింత పొగరా?' యని యనుకొనఁజొచ్చిరి. కొంచెము జనసమ్మర్దము తగ్గునప్పటికి గ్రామాధికారి శవ పరీక్షార్థమై వచ్చెను. అందుఁ బరీక్షించుట కే మున్నది? అద్దము చూపిన ట్లంతయుఁ గనఁబడుచునే యుండెను. గ్రామాధికారి శవమునకు దహనాధికార మొసంగి హంతకుని విచారింపవలయు నని గ్రామసావడియందు సభ చేసెను. జను లందరును హరిదాసున కెట్టిశిక్ష విధింపఁబడునో తెలిసికొందు మని క్రిక్కిరిసియుండిరి. హరిదాసుని మోచేతులు బంధించి తీసికొని వచ్చి యుండిరి. అందరియెదుట విచారణము ప్రారంభ మయ్యెను. కాని విచారించుట కేమున్నది? నరసరాయఁడు చేయఁదలచినది శ్రీదేవి మానభంగము. యత్నించినది హరి దాసుని ప్రాణాపహరణము. కలిగినది నరకలోకనివాసము. జనులందరును హరిదాసునిఁ గేవలము నిర్దోషియని తలం చిరి. కాని గ్రామాధికారిమాత్రము నరసరాయఁడు తనకు

దగ్గరవాఁడగుటవలనను, నందు జాత్యభిమానంబు నెక్కువగా బాటించువాఁ డగుటవలనను హరిదాసుని నిర్దోషి
ఉ౨౪౪క్షు.
యని తలంపక, కేవలము నరహంతకుఁడసియే యెంచి విచారణానంతర మాతనికి మరణదండనము విధించెను. హరిదా సప్పుడు తలయెత్తి గ్రామాధికారివంకఁ దీవ్రముగాఁ జూచెనేకాని నోరెత్తి యేమియుఁ బలుకకుండెను. అక్కడ నున్నవారందఱును గ్రామాధికారితీర్పునకు వింతపడిరి. అందరికి నాతనియెడఁ జురుక్కు మనెను. కాని

కం. సామజము చెఱకు మేసిన
దోమలు పదివేలు చేరి ♦ త్రోలంగలవా?
గ్రామపతి తగవు దప్పిన
గ్రామములో నున్నవారు ♦ కాదనఁ గలరా?

అను వచనానుసరణి సహించి యూఱకుండిరి. హరిదాసు నప్పుడే గ్రామచావడియందు దొడ్డిగదియందు బంధితునిగా నుంచిరి. ఎవరియిండ్లకు వారు వెళ్లిపోయిరి. ధర్మహానికి జనులు సహించియున్నను దైవము సహించి యుండఁగలఁడా!

గ్రామాధికారియిల్లు గ్రామచావడి నానుకొనియే యున్నది. హరిదాసునకు విధించినశిక్షను గూర్చి గ్రామమున గుజగుజలు పుట్టెను. ప్రతివాఁడును అన్యాయము అన్యాయము అని పలుకసాగెను. నిక్కముగ నన్యాయ మని గ్రామాధికారి యంతరాత్మకుఁ దోఁచుచునే యుండెను. కాని దురభిమానమువలన నాతనికి బుద్ధి పెడతలఁ బట్టినది. ఆతని

భార్యయగు చినదేవమ్మకీవిచారణము నచ్చలేదు. ఆమెమంచి పరిశీలనదృష్టి గలది. అందువలన హరిదాసుచేసినకృత్యము నీచుండగు నగిసరాయుని యెడలఁ దగినదియే యని భావించుటే కాక, యట్టివాని జంపుటయే నిజమగు పౌరుష మని యామె తలంచెను. భర్త తప్పుతోఁ బ్రవర్తించినందుల కామె కెంతయో కష్టముగానుండెను. కాని యాతనియెదుట సాహసించి మాటాడఁజాలదు. ఏలాగుననేనియు హరిదాసునిమరణ దండనము రద్దుచేయింపవలయు నని యామె సంకల్పించుకొనియుండెను. కాని తప్పించుటకుపాయ

చినదేవమ్మ.

మేమియు నామెకుఁ దెలియకుండెను. హరిదాసుని గురించి యామకేగాక యూరివారందరికిని మంచి యభిప్రాయ ముండెను. అదిగాక శ్రీదేవిసతీత్వమునుగూర్చి చినదేవమ్మకు జక్కగాఁ దెలియును. అట్టి పతివ్రతాశిరోమణి కన్యాయముగ అతిఘోరముగ అకారణముగ వైధవ్యము సంభవ మగుచుండ నెవ్వరేనియుఁ జూచి సహించి యుండగలరా? ధర్మస్వరూపురాలగు చినదేవమ్మకు దైవము తోడుపడకుండునా?

హరిదాసు తనకు విధింపఁబడిన మరణదండనమును గూర్చి యంతగా విచారించుట లేదు. కాని న్యాయపరిపాలనాదక్షు లగు పల్నాటి జనులనుగూర్చి తీవ్రముగా విచారింపఁదొడఁగెను. ఆతనికి శిక్ష విధింపఁబడి రెండుమూఁడు దినములయ్యెను. అక్కడ (శ్రీ)దేవమ్మ యన్న మనక, నిద్రయనక కంటికి మంటికి నేకధారగా నేడువ దొడంగెను. ఆమె నెవ్వరోదా

ర్పఁగలరు. హరిదాసుగూడ భార్యయవస్థకు మిక్కిలిగ వాపోవఁదొడంగెను. కాని యెవ్వరు సాయపడఁగలరు. ఒకనాఁడు హరిదాసు గదియందలి గవాక్షము నానుకొని యెద్దానిగూర్చియో పరధ్యానముగ నుండెను. అప్పుడు ప్రొద్దు నెత్తిమీఁదికి వచ్చియుండెను. అట్టియెడ నాతని నెవ్వరో పిలిచినట్లయ్యెను.

ఆతఁడు వెనుదిరిగి చూచునప్పటి కొక కుఱ్ఱవాఁడాతని మీఁద నొక యుత్తరమును వైచి యొక్కపరుగున వెళ్ళిపోయెను. హరిదాసున కాశ్చర్యమయ్యెను. చేతులు బంధింపఁబడి యుండుటవలన నతికష్టముతో నాయుత్తరము నందుకొని చదువుకొనసాగెను. చదువ మొదలు పెట్టినంతనే యాతనికిఁ గన్నులవెంట నశ్రువులు రాలఁజొచ్చెను. కొంత వఱకుఁ జదువునప్పటి కాతనికి నవ్వు వచ్చెను.

ఉత్తరము.

తుదివఱకుఁ జదివినంతనే 'యుక్తమా? అయుక్తమా?' యను రెండు వాక్యములాతని నోటివెంట నప్రయత్నముగా వెలువడెను. హరిదాసునకు సందిగ్ధావస్థ సంభవించెను. ఏమియును దోచలేదు. కాని 'యుక్తమే' యని యాతని యంతరాత్మ పలుకఁదొడంగెను. హరిదాసున కది వినఁబడుచునే యున్నది. తుద కాతఁడుగూడ 'యుక్తమే' యని సిద్ధాంతీకరించుకొని యాయుత్తరమును ముక్కలు ముక్కలుగాఁ జించి పాఱవైచెను. ఇదియంతయును నెవ్వరికిని దెలియదు. గడువుదినము సమీపించెను. హరిదాసు నురిదీయుదురని చుట్టుపక్కల గ్రామవాసులందరికిఁ దెలియవచ్చెను. పాపము! అందరును హరిదాసునిగూర్చి విలపింపఁ దొడగిరి.

మంచివాఁడు నిష్కారణముగ వధింపఁబడనున్నప్పు డెవ్వరు కంటఁ దడిపెట్టకుందురు? అయ్యో! తనభర్తకై విలపించుచున్న శ్రీదేవిని-ఆమహాతల్లిని-ఆసాధ్వీమణిని-ఆయూరి శ్రీదేవిని- ఎవ్వ రోదార్చువారు? ఆమెకు వైధవ్యము దప్పదా? ఆమెభర్తను గాపాడువారు లేరా? ధర్మమునకు రక్షణము లేదా? గుత్తికొండయం దెచ్చటఁ జూచినను శోకదేవత తాండవమాడు చుండెను. నాఁడే గడువుదినము. వఱువాతనే గ్రామాధికారి గ్రామసావడికి వచ్చెను. చేతులు గట్టుకొని మోతాదులాజ్ఞకై వేచియుండిరి. ఉరిదీయువారు తగినసన్నాహముల నొనర్చుచుండిరి. ప్రజలందు స్త్రీపురుషభేదమేనియు నెంచక గ్రామచావడిచుట్టును మూఁగియుండిరి. రెండుగడియల ప్రొద్దెక్కెను. గుత్తికొండయం దాపూట నెవ్వరును బొయ్యి రాజఁబెట్టి యెఱుంగరు. గృహములన్నియుఁ బాడుపడినట్లుండెను. తుదకు నోరులేని పక్షులుగూడఁ దమతమ యెఱ్ఱకై పోవుట

సంక్షోభము.

మాని గ్రామచావడి ముంగిటనున్న వేపమ్రాను మీఁద నిలచి ముందు జరుగనున్న ఘోరకృత్యమును గాంచలేక యేడ్చుచున్నవో యన్నట్లు గోలగా నఱచుచుండెను. పశువులు ‘అంబా’ యని మొఱపెట్టుచుండెను. కుక్కలు ‘కుయ్యో కుయ్యో’ యని యరచుచుండెను. ఇవ్విధి గుత్తికొండయందుఁగల సర్వప్రాణులును హరిదాసునికై దుఃఖించుచుండెను. శ్రీదేవి కానాఁడు ప్రపంచమంతయు శూన్యముగాఁ గనుపట్టుచుండెను. అప్పటి యామె యవస్థను చూచినవారందరును నిఁక నామె బ్రతుకునా యని

విచారింపఁజొచ్చిరి. ఆమెయుఁ దనభర్తకుఁ గలుగఁబోవు భయంకరమరణమును గనులఁ జూడఁజాలక యింటియందే పడి యేడ్చుచుండెను.

జాము ప్రొద్దెక్కెను. ప్రజలందరు హరిదాసునిరాక కై నిరీక్షించుచుండిరి. అప్పుడు బంధితుఁడగు హరిదాసు నచ్చోటికిఁ దీసికొని రాఁబడియెను. ఆతని మొగమునందు దుఃఖసూచన లెప్వియును గన్పడుట లేదు. నిర్భయముగ అపరిమితానందముగ ఒకసారి సభనంతయుఁ గలయఁ జూచెను. ఆతని కెవ్వరగుపడిరో కాని యొక్కసారిమాత్రము తలనాడించెను. తిరిగి మొగమెత్తలేదు. గ్రామాధికారి యందరిని సంబోధించుచు, 'నేటితో హరిదాసునకు జీవితసమాప్తి కానున్నదిగాన, నాతని కేదేనిఁ గోరికయున్నచో నద్దానిని నెరవేర్పుమనకు విధియై యున్నది' అని పల్కెను. 'హరిదాసడిగినదానిని మనము తప్పక నెఱవేర్పవలయును' అని ప్రజలందరును గంఠోక్తిగా నడిగిరి. హరిదాసప్పుడందరినిఁ దిలకించి 'అయ్యలారా! ఇప్పుడు నా కేమియు భయమను మాటయే లేదు. నేనందఱివలనను, నరహంతకుఁడనని యెన్నఁబడి యుంటిని' అని యనునంతలో నెవ్వరో 'లేదు' అని బిగ్గరగాఁ బలికిరి. అందఱును నాశ్చర్యముతోఁ దిలకించిరి. కాని యావ్యక్తి యెవ్వరో వారికిఁ దెలియదయ్యెను. తిరిగి హరిదాసు 'నా కెటులైనను నేఁడు చావుతప్పదు. కాని నాకొక్కకోరిక గలదు. మీరందఱును నాఁకుగల తుదికోరికను దీర్పనుంటిరిగాన యడుగఁదలంచితిని' అని యనునంతలో 'తప్పకుండ' అని యాతని నెవ్వరో

సంబోధించిరి. ప్రజలందరును దిరిగి యావ్యక్తి యెవ్వరో యని
విచారించిరి. కాని తెలియ వచ్చినది కాదు. హరిదాసు తిరిగి
పలుక నారంభించెను.

"అడుగుటకు నా కెంతమాత్రమును సంకోచము లేదు.
ఇంతకంటె నేను మంచివాఁడనుగాఁబోను. ఎన్నాళ్ళనుండియో
నా కొకరియందు మనస్సులగ్నమై యుండెను. ఎంతయత్నించి
నను నా కది లభించినది కాదు. ఆకోరికను నేఁడు మీరు తీర్ప
వలయును. ఆవ్యక్తియెవ్వరోగాదు. మీరందరును నెఱుంగుదురు.
ఆమె గ్రామాధికారిభార్యయగు చినదేవమ్మ" అని యనినంతనే
గ్రామాధికారికిఁ గోపము ప్రజ్వరిల్లిపోయెను. తోఁకత్రొక్కిన
త్రాచుపామువలెబుస్సుమనుచు 'ఓరీ! నీచుఁడా' యని యాతనిపై
కురికెను. "అన్యాయము, అన్యాయము" అని తిరిగి యెవ్వరో
పలికిరి. జనులందఱాశ్చర్యచకితులై చూచుచుండిరి. స్త్రీసమూ
హమునుండి యొకవ్యక్తి యీవలకు వచ్చి గ్రామాధికారిని
సమీపించి యాతని రెండుచేతులను బట్టుకొని
'నాథా! ఆగు మాగుము. అంతకోపమువలదు.

ఉరిశిక్ష తప్పెను.

ఇదియేనా మీ న్యాయవిచారణము. మీ భార్యనడిగినందులకే
యింతకోపము వచ్చియున్నప్పుడు, హరిదాసునికండ్లయెదుట
బతివ్రతామతల్లియు, ననుకూలవతియు నగు నాతని భార్యను
నొక్క నీచుఁడు నిర్బంధించినప్పు డాతని కెంతకోపము వచ్చి
యుండునో యూహింపుఁడు. అడిగినందుకే యాతనిఁ జంపుటకు
మీ రుద్యుక్తులై యుండఁ జెరుచునప్పు డాతఁ డెట్లుండవల
యునో విచారింపుడు. భార్యావమానము మీ కెంత సహింపరా

నిదో యెల్లరకు నంతేయని భావింపుడు. ఒక పుణ్యాంగనకు మానభంగము జరుగుచుండ మీరు చూచి సహించి యుండఁగలరా? మీభార్య యొకరివలన మానభంగమందు నున్నప్పు డట్టివానిని మీరు గనులారఁ దిలకించి ప్రాణములతో విడిచి పెట్టుదురా! హరిదాసునియెడ నించుక దప్పేమాత్రమును లేదు. పరాంగనాపహారణుల కనాదినుండియు మరణము గలుగుచుండుట లోకవిదితమే కదా! అట్టివానికి మరణదండనమునకన్న వేఱొక శిక్ష యున్నదా? కులసతీమానభంగమునకు నపుంసకుండైనను సహించి యుండఁగలఁడా? హరిదాసునెడల మీరు గనఁబఱచిన న్యాయ మిదియేనా? ఓ పల్నాటి వాసులారా! మీ కేమియు నిది యన్యాయ మని తోఁచుట లేదా? మీయందఱిభార్యలవంటిదిగాదా హరిదాసునిభార్య!' అని యీవిధమున ధర్మోద్రేకమువలన నాధర్మస్వరూపురాలు పలికినప్పుడు గ్రామాధికారియే గాదు ప్రజలందఱు నొక యాదాసుదానికిఁగల న్యాయపరిపాలనాదక్షతయు, సాహసమును దమకు లేకపోయెఁ గదా యని తలవంచుకొనిరి. గ్రామాధికారికిఁ దనతప్పింతయుఁ దెలియవచ్చెను. ప్రజలందఱును నింక నుపేక్ష చేయఁగూడదని భావించిరి. చినదేవమ్మ యప్పుడే హరిదాసుని విగతబన్ధునిగఁ జేసెను. ప్రజలందరు 'ఉరిశిక్ష తప్పినది' అని సంతోషముగ నరువసాగిరి. హరిదాసు చినదేవమ్మకుఁ దనకృతజ్ఞతను వెల్లడించెను. శ్రీదేవికి సుఖదినములు లభించెను.

పాఠకుల కిప్పటికి హరిదాసున కురిశిక్ష తప్పుటకు మొదటినుండియుఁ జినదేవమ్మయే కారణమని తెలియవచ్చియే యుండెను. హరిదాసునకు నుత్తరము వ్రాసినవారును, నిండుసభయందావిధి నడుగు మని యుత్తరముద్వారా సలహా జెప్పిన వారును, హరిదాసు సభయందుఁ బలుకుచుండ 'లేదు, తప్పకుండ అన్యాయము, అన్యాయము' అని పలికిన వారును, చినదేవమ్మగాక మఱియెవ్వరు? హరిదాసునకుఁ జినదేవమ్మ వ్రాసిన యుత్తరమును జదువునప్పుడు నవ్వువచ్చుటకుఁ గారణమున్నది. ఉత్తరమం దాతనికిఁ జినదేవమ్మ, తన కతనివలన

చిక్కుపడినను.

దప్పేమియు లేదని తెలియుననియుఁ దనభర్త యన్యాయముగాఁ బ్రవర్తించెననియుఁ గాని యాతనియెదుటఁ దాను సాహసించి మాటాడలేననియుఁ దెలిపి యుండుటవలన, నామె సాధువర్తనమున కాతనికి నవ్వు వచ్చెను. ఉత్తరమును బూర్తిగాఁ జదివినంతనే 'యుక్తమా? అయుక్తమా?' అని యాతని నోటినుండి వెడలుటకుఁ జినదేవమ్మవంటి మహాయిల్లాలినిఁ గూర్చి నిండుసభయందట్లను గుట భావ్యమా యని యాతనికిఁ దోఁచుటయే కారణము. కాని తుదకు ధర్మమే జయమును బొందినది. చినదేవమ్మ సచ్చరిత్ర మెల్లెడల వ్యాపించినది. గుత్తికొండజనులందఱు నాటనుండి బుద్ధికలిగి వర్తింపఁ దొడంగిరి.

# ౫. బాలవీరుఁడు

'అచటఁ బుట్టిన చిగురుగొమ్మైనఁ జేవ.'

—మనుచరిత్రము.

పోలిశెట్టి కాపురస్థలము దాచేపల్లి. జన్మభూమి యేదియో తెలియదు. అతఁడు మొదట పైగుడ్డతో లేచివచ్చి దాచేపల్లియందు బేరము సాగించెను. సెనగగుగ్గిళ్ళమ్ముకొను టయే యప్పటి యాతనిస్థితికిఁ దగియుండెను. కాని రోజులు గడచినకొలఁది బేరము కలిసివచ్చుచున్నందునఁ గొంత డబ్బును వెనుకవేసికొని చిల్లరదుకాణమును బెట్టెను. ఊరివా రందరతనిని గుగ్గిళ్ళ పోలిశెట్టియని పిలుచుచుండెడివారు. అతని కెవరెవ్వర నేవిధముగా మెలఁగవలయునో బాగుగాఁ దెలియును. అందువలనఁ జిల్లరబేరముకూడఁ జక్కఁగాఁ గలిసి వచ్చుచుండెను. వచ్చినరొక్కమూఁడేండ్లకే కులమింటికోతి నొకదానిని బెండ్లిచేసికొని యొకయిల్లు కట్టుకొనెను. పెండ్లి యయినప్పటినుండియు నాతనికి సిరియెత్తుకొని వచ్చి, పట్టినదెల్ల బంగారమగుచుండెను. చిల్లర దుకాణము నెత్తివైచి పెద్దవర్తకమునకు దిగెను. జట్టీలు దీసికొనుటయు, మారుబేరములకుగింజబట్టుటయు, వడ్డీవ్యాపార మొనర్చుటయు మొదలగువానికలవాటుపడి కొలదికాలముననే యొకమెట్టుపొలము సంపాదించెను. వర్తకమునందును భూమి యందును బాగుగా లాభించుచుండుటవలన గొప్పకవిలెగలవాఁ

పోలిశెట్టి.

డయ్యెను. అతఁడు మొదటినుండియు లోభబుద్ధిగలవాఁడు కాఁడు. శక్తికిదగిన ట్లొకరికి సాయమొనర్చుచుండెడివాఁడు. ఇంతకు గుణము మంచిదియగుటవలన భగవంతుఁడుగూడఁ జక్కఁగాఁ జూచెను. అన్నిటియందును దాచేపల్లి వర్తకులయందంతటి వాఁడు లేఁడనిపించుకొనెను. వర్తకులందరతనిని దమకుఁ బెద్ద శెట్టిగా నేర్పఱచుకొనిరి.

పోలిశెట్టికి భార్య కాపురమునకు వచ్చిన నాలుగైదేండ్ల లోపలనే యిద్దరుకుమారులు గలిగిరి. పెద్దవానిపేరు పెదన్న. చిన్నవానిపేరు వీరన్న. పెద్దవాఁడు చక్కఁదనమున నన్నకు నయ్యకు నేమాత్రము తీసిపోవువాఁడు గాఁడు. ఆకారణమునఁ బాలకుఁడఁబంటివాఁడు. చేతులకు వెండిమురుగులు, దండచేతికి గడియము, మెడలో నొక వెండికంటెఁ బెట్టుకొని తిరుగుచు నుండు పోలిశెట్టికెంతో సంబరముగా నుండును. అతనికి మొదటి నుండియుఁ బెదకుమారునియందు మంచిప్రేమ. అందువలన నాతఁడెంతో గారాబముగాఁ జూచుచుండెడివాఁడు. చిన్న వానియందుఁ బోలిశెట్టి కంతగా మనస్సు లేదు. కాని యాతని భార్యమాత్రము చిన్నకొడుకును గన్నులలో నిడికొనుచుండెడిది. వీరిద్దరితరువాత వారికి సంతానమే కలుగలేదు. అందువలన దంపతులిద్దరును వేఱొకరిని గారాబముతోఁ బెంచుచుండిరి. అట్లని వలపక్షమున్నదని యనుకొనవలదు. వారిద్దరును దల్లిదండ్రులకు రెండునేత్రములు.

పిల్లలకు యుక్తవయస్సు రాగానే పోలిశెట్టి వారికి విద్యాభ్యాసము చేయించెను. ఆబాలకు లిద్దరును బడికి పోవుచున్నప్పు డూరిలోని కాపుపిల్లలందరు,

'కోమటి పిరికి, కొడితే ఉరికి
గుగ్గిలశెట్టికొడుకూ వీడూ
పెద్దన్న మొద్దు వీరన్న యెద్దు
కరిగెత్తుకుంటా బడికెల్లుతుంటే
కుంయికుంయిమంటా గోలెత్తుతాడూ
పంతులుగారూ బడికీబోతే
పడదన్నుతాడు
గుగ్గిలశెట్టి పెద్దన్నా
గుగ్గిలశెట్టి వీరన్నా.'

అని గోలపెట్టుచుండెడివారు. పెద్దన్నకుఁ బిల్లలంటే తగని భయము. అందువలనఁ గాపుపిల్లలెంతగోలచేసినా మాట్లాడకుండఁ బడికిఁ బోవుచుండెడివాఁడు. కాని వీరన్నకు మాత్రము చాలా కష్టముగా నుండెడిది. అతఁ డొక్కొక్కప్పుడు కసుపుఁగోముంచి వారితోఁ బోట్లాట పెట్టుకొని నాలుగు తినేవాఁడు. పరిస్థితి యీవిధముగా జరుగుచుండుటవలన నాతనికిఁ బడికిఁ బోవుటకు మనస్సొప్పకుండెను. ఒకొక్కనాఁడు బడికిఁబోక యెక్కడికో చెప్పకుండ లేచిపోవుచుండెడివాఁడు. పెద్దన్న మాత్ర మెవ రెన్నియన్నను మెదలకుండ బడికి వెళ్లుచుఁ జక్కఁగాఁ జదువుకొనుచుండెను.

తల్లిదండ్రు లెంతచెప్పినను వీరన్న మాట వినేవాఁడు కాఁడు. 'నాకుఁ జదువువద్దు' అని ఘంటాపథముగాఁ జెప్పుచుండెడివాఁడు. అందువలనఁ బోలిశెట్టి కొక్కొక్కప్పు డాతని మీఁద గోపము వచ్చెడిది. కోపము మితిమీరినప్పుడు కుమారునిఁ బక్కలెట్లు విరుగఁ దన్నుచుండెడివాఁడు. 'ఎంత కొట్టినను కొట్టండి చంపండి. నేను బడికిఁ బోను' అని వీరన్న చెప్పుచుండెడివాఁడు. తుదకు విసిగి తల్లిదండ్రు లతనిని వదలివైచిరి. పెద్దన్న చక్కగాఁ జదువుకొనుచుండుటవలనఁ బోలిశెట్టి కాతనియందు మునుపటికన్న ప్రేమ యెక్కు

విద్యాభ్యాసము.

వయ్యెను. వీరన్న బడికిఁ బోవుట మానివేసి నాఁడనేకాని, కాలమును మాత్రము వృథబుచ్చులేదు. ఆతఁ డొక ఉండేలుబద్దను సంపాదించుకొని, చుట్టుపక్కల పొలములకు వెళ్లి స్వయముగా గురినేర్చుకొనుచుండెను. ఆతనికి క్షణము తీరిక లేదు. పని లేనప్పుడు పలుగురాళ్లను గుండ్రముగా నరుగదీయుచుండెడివాఁడు. ముప్పొద్దులయందు గురి నభ్యసించుచుండెడివాఁడు. శ్రద్ధగలిగి పనిజేసినయెడల సబ్బనిది యొకటియుండఁ బోదు.

'సాధనమున బనులు సమకూరు ధరలోన' అనుమాట వీరన్నయందు సార్థకమయ్యెను. ఆతనికి రోజులు గడచిన కొలఁది యనవరతాభ్యాసమువలన గురి చక్కగా నిలువ నారంభించెను. ఎచ్చోటఁ దగులవలెనన్న నచ్చోటఁ దగులుచుండెను. ఇదంతయు నతనితల్లిదండ్రులకుఁ దెలియదు. వా రతనిని గాలికిఁ దిరుగుచున్నాఁ డనియే భావించుచుండిరి. పెద్దన్నయే,

లేవ లేనప్పుడు తమకు గుక్కెడుగంజి పోయఁగలవాఁడని సంబరపడుచుండిరి. వీరన్న తన కేమాత్రముఁగురి నిల్చినదో పరీక్షించుకొనుటకై యెల్లప్పుడు నాగులేటి కరిగి యచ్చోట నీటికై వచ్చు యమ్మలక్కలకుండలకు రాళ్ళతో బెజ్జములు గొట్టి, తిరిగి వానిని మంటితోఁ గప్పుచుండెడివాఁడు. ఇదియంతయు నాతఁడెచ్చోటనో నక్కి యొనర్చుచుండెడివాఁడు. అందువలన నీతనిపాండిత్య మెవ్వరికిని దెలియవచ్చినది కాదు. ఈతని విద్యాభిశేషంబువలన గుమ్మరివాండ్రకు పని చిగిరించినది. ఏమున్నది? గ్రామమున నెవ్వరియింటఁ జూచిన నోటికుండలే. నేఁడు క్రొత్తకుండఁగొన్న రేపటి కప్పుడే యోటికుండ యగుచుండెను. ఈవిధముగా వీరన్న గురిసభ్యసించి యెగిరిపోవుచున్నపిట్టను గొట్టునంతటి నేర్పునేగాక యించుమించుగఁ బావుక్రోసు దూరమువఱకు గురితప్పకుండఁ గొట్టునంతటి నేర్పును గూడ సంపాదించియుండెను. వీరన్న సార్థకనాముఁడనే రోజులు రావలసియున్నవేమో?

పెద్దన్నకుఁ బదునాలుగేండ్లయీడు వచ్చెను. విద్యాభ్యాసము ముగిసెను. వ్యాపారమునందుఁ దండ్రి కక్కఱకు వచ్చి తండ్రిని మించినవాఁడురా యనిపించుకొనెను. పెద్దన్న చేతికక్కఱకువచ్చినప్పటినుండియు బోలిశెట్టి యింటియందే చిన్నమ్మ స్థిరనివాస మేర్పఱచుకొనెను. అందువలనఁ బ్రతివారును మేమంటే మేమని పెద్దన్నకుఁ బిల్ల నీయవచ్చుచుండిరి. బెల్లమున్నప్పుడు చీమలు వేనకువేలు వచ్చుచుండుట సహజమే గదా! బోలిశెట్టికిఁ గుమారులిద్దరికి నొక్కమారే పెండ్లిచేసిన

మొదల ఖర్చులో ఖర్చు కలిసిరాఁగల దని యభిప్రాయముం డెను. కాని వీరన్నకుఁ బిల్లనిచ్చెద మని వచ్చినవా రెవ్వరును లేరు. ప్రతివారును నాతనిని విద్యాశూన్యుఁ డని తలంచి యుండిరి. అదిగాక యాతఁడును నెల్లప్పు డింటికడ నుండక పొలములు బట్టుకొని తిరుగుచుండెడివాఁడు. వేషముఁ జూత మన్నను గోచిపెట్టుకొని తిరుగుచుండెడివాఁడు. అందువలన నాతనికిఁ బిల్లనీయుట కెవ్వరును సమ్మతింపలేదు. పోలిశెట్టి యెంత యత్నించినను వీరన్నకుఁ బిల్ల లభింపలేదు. తుదకుఁ బెద్దన్న కొక్కనికే వివాహ మొనర్ప నెంచి వచ్చినసంబంధములలోఁ దనకన్నింటి యందు సరితూఁగునట్టి కారెమపూడిసంబంధము నిశ్చయ పరచుకొనెను. మంచిరోజు చూచుకొని, యడుగడుగున ననుమానాస్పదములు గనుక తెల్లవారక మునుపే పొలిమేర దాటి పండుపసుపు బట్టుకొని వెళ్ళి పిల్ల తమ దనిపించుకొని వచ్చిరి. నాటనుండి పోలిశెట్టి యింటియందు వివాహప్రయత్నములు జరుగుచుండెను. పెద్దశెట్టి చుట్టపక్కములనేగాక, యూరివారి నందరిని నాహ్వానించెను. పెద్దన్న పట్టశక్యము గాకుండెను. వీరన్న తీరిక లేకుండెను.

వివాహనిశ్చయము.

తేపే సుముహూర్త మైయుండుటవలన నారోజు పోలిశెట్టి యింటియందుఁ జాల గందరగోళముగా నుండెను. కోమటక్కల గొంతు చెవిటివానికిఁ గూడ స్పష్టముగా వినవచ్చుచుండెను. చుట్టుప్రక్కలనున్న వారలకుఁ జక్కఁగాఁ దెలియునట్లు కొంద అతిగహాస్యముగా మాట్లాడుకొనుచుండిరి. దీర్ఘములు పలుక

నేరని వారంద ఱానాఁడా కోమటి యాఁడుపడుచుల సంభాషణ ములవలన గుణింతమునఁ బ్రవీణు లగుచుండిరి. అమ్మలక్క లందరు సొమ్ములు పెట్టుకొనువారలును, గుడ్డలు సవరించు కొనువారును, బిల్లల సముదాయించుకొనువారును, బిచ్చగాం డ్రను దమిరికొట్టువారును, బెండ్లికొడుకు నలం కరించువారును నై పనిని దెమలనీయకుండిరి.

ప్రయాణము.

పొద్దుగూకులు సవరించుచున్నను వారిసవరణల కంతము కనుపడుట లేదు. ఇంతలో పొద్దు కూకినది. అప్పు డందరికిఁ దొందరలు హెచ్చినవి. అంద రొక్కమారుగా ముందు భోజనములు చేసిరి. ఇంతలో బండ్లవాండ్లు వచ్చి తొందరింప సాగిరి. పోలిశెట్టి కేకలు వేయసాగెను. ఒకవంక బాలకులకుఁ బసిపిల్ల లేడువసాగిరి. వీధిలో బిచ్చగాండ్రు గోలపెట్టుచుండిరి. ఇల్లంతయు 'గీ' 'బా' గానుండెను. ఈతొందరింపులోఁ గొంద ఱక్కలు రవికెలు తిప్పి తొడుగుకొనుచుండిరి. కొందరు చీరెకన్ని నిగోచి కుంచుకొని, యుంచు లేని కొంగును బైటకు పయోగించు కొనుచుండిరి. ఇఁక మగవారందఱుఁ బెట్టెలను బండ్లలోనికిఁ జేరవైచుచుండిరి. అందరన్నివిధములఁ దొందరించునప్పటి కొక మాదిరిగా నలంకరించుకొని యాఁడువారందరు నెత్తుపీటలు వైచుకొని బండ్లలోఁ గూలఁబడిరి. బండికిద్దఱికన్న నెక్కువగాఁబట్ట కుండిరి. కర్మముజాలక మూఁడవవాఁడు పిల్లవాఁడైన నెక్కెనా వాని యవస్థ యింక భగవంతునికే యెఱుక. ఆకోమటితల్లులంత పలుచని లంబశరీరములు గలవారు. బండ్లవెనుకను, ముందును, మధ్యను గావలివారు సాయుధులై యుండ నన్నియుఁ

జక్కఁ బెట్టుకొని పోలిశెట్టి బంధువులు మొదలగు వారందఱితోఁ గారెమపూడికి బెండ్లిప్రయాణమును సాగించెను.

నాఁడు కృష్ణపక్ష చతుర్థి. సకాలమునకు నెల పొడిచి నది. కాని యాకసము మేఘావృతమై యుండుటవలన వెన్నెల మసక మసకగా నుండెను. కటికచీకటిమాత్రము గాదు. పెండ్లివా రూరు దాటునప్పటికి నెల చక్కఁగా బొడిచెను. షుమారు నలుబది బండ్లు పోవుచుండెను. పేరునకుమాత్రమే గాని తిప్పి తిప్పి లెక్క వేసినను నెనుబదిమందికిఁ దక్కువగా జన ముండిరి. అందుఁ జాలవఱకు కాఁడువారలే. మగవార లేముప్పదిమందికో యుండిరి. కాని బండ్లవారితో లెక్క వేసిన యెడల మగవారు దాదాపు నూరుమందికి యుండిరి. మొత్తము మీఁద నారాత్రి పెండ్లికిఁ బోవువారాఁడువారును, మగవారును గలిసి నూటయేబదిమందికి మించియుండిరి. ఈ పెండ్లిసందడి యందు వీరన్నను గూర్చి యంతగా నాలోచించినవా రెవ్వరును లేరు. చుట్టాలతోఁ బాటతఁడు గూడ పెండ్లికిబయలుదేరెను. కాని యాతఁ డేమాత్రము తగినరీతి నలంకరించుకొనక యథాప్రకారముగనే గోచిపెట్టుకొని తనయుండేలుబద్దను, రాతిగుండ్లతో నింపఁబడిన రెండు చెక్కపెట్టెలను దీసికొని చిట్టచివర బండి యందాతఁ డొక్కఁడే కూర్చుండెను. చివరబండి యని భయపడి యెవ్వరెక్కకుండుటయే యాతనికి మేలయ్యెను. జామున్నర ప్రొద్దగునప్పటికి బండ్లన్నియు రహదారిమార్గమును వీడి యడవిమార్గమునఁ బోవుచుండెను. పల్నాటివారలకు రాత్రిప్రయాణమన్న నెంతో సంతోషము. బండ్లుపోవుచున్న

ష్పుడు చాల సందడిగా నుండెను. పెండ్లివారందరు లోకాభిరామాయణమున మునింగియుండిరి. బండ్లవారిలోఁ గొందరు "ఓరినీ యెద్దులుగాల? నడవనే నడ వశ" అని యదలించుచుండిరి. కొందరు 'ఓరి నీయాలితాడు తెగ! దాపటెద్దు పక్కగాఁ బోనియ్యండిరో' అని మందలించుచుండిరి. కొందరు పాటలఁ బాడుచుండిరి. వారిలో నొకఁడీరీతిగఁ బాడుచుండెను.

## పాట.

వస్త్రపదర పత్తిచేనికి । నావైలుకాడా
చిత్తముంచు ముమ్మాటికి ॥ వ ॥
ఎలికతోక చెండ్రికోల । యొడిగుబ్బల జడ్డిగాము
గురిగింజ యిత్తనము గుత్తుగాపెట్టనచేనికి ॥వ॥
వెడలిపొయ్యె దోవలోనె । కరణమోరికందిచేలో
రాజు లుండె కచ్చేరీకి । రాచబండకుత్తరంగ ॥వ॥

ఈవిధముగా రెండు జాములు గతించినవి. మూడవ జాము జరుగుచుండెను. అడవియంతయుఁ బ్రతిధ్వనించుచుండెను. ఎల్లరును సంతోషమున మునింగియుండిరి. కావలివారలేమరక బండ్లకిరుప్రక్కలయందు సాయుధులై నడచుచుండిరి.

**దొంగలగుంపు.** అది యొక యెడారిమార్గము. ఎచ్చట జూచినను జెట్లు దట్టముగాఁ బెరిగియుండెను. దానికిఁ దో డామార్గమున నొకచింతతోపు గలదు. పట్టపగ లే యచ్చటఁ బ్రయాణీకులకు బుర్రరామకీర్తన జరుగుచుండెను. దానికి దొంగచింత యని పేరుగలదు. కాని పెండ్లివారికిమాత్రము

నిర్భయముగా నుండెను. తగినయట్టహాస మున్నందునఁ దమకు దొంగభయ ముండదని యందరును భావించియుండిరి. కాని దేవుడుమాత్ర మట్లు తలఁచియుండ లేదు. ఇంతలో బండ్లు దొంగచింతను సమీపించినవి. పై కెంత బెట్టుసరిగనున్న నక్కడికి వచ్చునప్పటి కందరికిని గుండెపీకుడు కలిగెను. ఎట్టిశబ్దము చేయకుండ నెద్దులను వడివడిగా నదలించుచుండిరి. తోపు నడిమధ్యకు బండ్లన్నియు వచ్చెను. తగిన సమయము. గుడ్డివెన్నెల. పెండ్లివారి ప్రయాణము. అందున్నవారు, సహజముగాఁ బిరికివారు. ఇఁకఁ జెప్పనదేమున్నది? అప్పుడేయెక్కడ నుండియో యొకదొంగగుంపు వచ్చి పడనే పడినది. ఆగుంపును గాంచినంతనే యందరికిని శరీరములు చల్లఁబడినవి. బండ్లన్నియు నిలువున నాగిపోయెను.

దొంగలు షుమారు రెండువందలమందికిఁ బైగా నుండిరి. అదిగాక ప్రతివారును సాయుధులై యుండిరి. పెండ్లివారిలో దొంగల నెదిరించుటకుఁ జాలినంతమంది లేకుండిరి. ఉన్నవా రందరికిని దగిన యాయుధములు లేకుండెను. ఇఁక వారేమి చేయఁగలరు? దొంగలందరును జుట్టుముట్టిరి. ఒక్కరును వారల నెదిరించినవారలు గారు. తట్టెడు తట్టెడు సొమ్ములు పెట్టుకొనియున్న యమ్మలక్కలందరు గుడ్డలు తడుపుకొనుచుండిరి. పోలిశెట్టికి ముచ్చెమటలు గ్రమ్మెను. నోటమాటయే లేకుండెను. ఒక్క

దోపిడి.

రొక్కరే వేంకటేశ్వర్ల ముద్ర చెల్లించినట్లు నల్లపూసదగ్గరనుండియు నొలిచి దొంగల కర్పించుచుండిరి. కొంద

రేడుపురాగమును జక్కఁగా నాలాపించుచుండిరి. కొలఁది కాలముననే యున్న సొమ్మంతయు దోపిడి చేయఁబడెను. దొంగలందరొకచోటికి గుంపుగాఁ జేరుకొని దోపిడి సొమ్ము నంతయు నొకచోటఁ గుప్పగాఁ బెట్టిరి. ఇన్ని యెండుకట్టెల రగుల్కొలిపి యావెలుగున దొరికినసొమ్మును బరీక్షించుచుండిరి. ఆఁడువారందరు గోలపెట్టుచుండిరి. మగవారు తిట్టుచుండిరి. ఎవ రెన్ని యన్న నేమి? వారికిఁ గావలసినది యనాయాసముగ నొక్కరుఁ జావకుండ శరీరకష్ట మేమాత్రమును లేకుండఁ జేఁజిక్కినది. దొంగలందరు గుడ్డలు పరచి మూటలు గట్టుచుండిరి. వారి సంతోషమునకుఁ బెండ్లివారి యేడుపునకు మేరయే లేకుండెను.

దొంగలు చుట్టుముట్టినంతనే వీరన్న మరుమాటలాడక, కాలయాపన మేమాత్రమును జేయక, యుండేలుబద్దను, నొక పెట్టెను, దీసికొని యెక్కడికో పోయెను. అతఁడట్లేగి దొంగలందరు తనకుఁ దాపునను, జక్కఁగా నగపడునట్లుగను, దగియున్న యొకచోట నిలిచి తన నేర్పు వెల్లడి యగున ట్లుండేలు బద్దను నాడింపఁ దొడంగెను. అచ్చోట దొంగలందరు కదలి పోవుటకు సంసిద్ధులై యుండిరి. ఆసమయముననే వీరన్న సరి యగు గురి నిల్పి మొదటి రాతిగుండును వదలెను. ఒక్కటే దెబ్బ. తగిలినదొంగ గిరగిరఁ దిరిగి క్రింద బడిపోయెను. వీరన్న విజృంభించెను.

వీరన్న విజృంభణము.

తెంపులేకుండ రాళ్ళవాన గురిపింపసాగెను. దొంగలందరు తెల్లబోయి చూచుచుండిరి. ‘ఫెటీ’ ‘ఫెటీ’ మని రాళ్లువచ్చి

తగులుచుండెను. దెబ్బ కొక్కఁడువంతునఁ బడిపోవుచుండిరి. వీరన్నగురి యేమాత్రము దప్పుటలేదు. దొంగలు పడిపోవకుండ నుండుట లేదు. తలయెత్తి యెట్లుచూచుటకు వీలుగాకుండెను. పెండ్లివారంద రాశ్చర్యముతోఁ జూచుచుండిరి. దొంగలు గడియ గడియకుఁ బలుచఁబడుచుండిరి. పలుచఁబడిన కొలఁది దొంగలధైర్యము పలుచఁబడుచుండెను. ఇంచుమించుగ సగము మందికి నాశనమైరి. ఇక మసలుట తడవుగాదని, సొమ్మంతయు నచ్చోటనే వదలి యెవరికి వారు కాలికి బుద్ధిసెప్పిరి. కనుదెఱచులోపల దొంగలందరుఁ బలాయితులైరి. వారరిగినంతనే కోమటిపెండ్లి పెద్దలకు వాక్ప్రారుషము మించెను.

కాని వారినిఁ గాపాడిన యావీరుఁ డెవ్వఁడో వారికిఁ దెలియకుండెను. అందరును బండ్లుదిగి యెవరిసొమ్మును వారు దీసికొని నోటికి వచ్చినట్లు ప్రగల్భములఁ బలుకఁ దొడంగిరి. 'మనకు భయపడి పోయినారురా' యని కొందరును, 'దెబ్బల కాగలేక పోయినారురా' యని కొందరును, 'పట్టి శిక్షించి పోతామేమో యని పోయినారురా' యని కొందరును, నిట్లనేకవిధముల నుగ్గడింపఁ జొచ్చిరి. గండముగడచి పిండము బయటఁ బడె నన్నట్లందరుఁ బునర్జన్మ మెత్తినట్లుగా భావించి ప్రయాణము సాగించిరి.

వీరన్న దొంగలు పరుగెత్తిపోవుటఁ గాంచి యిఁక భయము లే దని తిరిగి తన బండికడకు రాఁదొడంగెను. కాని వచ్చునప్పటికి బండ్లన్నియుఁ గదలిపోయెను. పాపము! వీరన్న

దిగులు పడెను. తన్నుఁగూర్చి కన్న తల్లిదండ్రులే విచారింప రైరిగదా యని యెంతయో నొచ్చుకొనెను. బండ్లన్నియు గూతవేటు దూరమును మించిపోయెను. అరచినందువలన లాభ మే మున్నది? కాని యాతఁడధైర్య పడలేదు. మార్గమునుబట్టి పోవసాగెను. అట్లుపోవు నప్పు డాతని కాకటికిచీకటి యందు నాయడవిలో నొకమూలఁ బెద్ద వెలు గాతనికిఁ గనఁబడెను. అయ్యది బండ్లవెలుగే యని యాతఁడు పొరపాటుపడి యామార్గము ననుసరించెను. వెలుగును సమీపించుచున్నను నాతనికి బండ్లసందడి యేమాత్రమును వినవచ్చుటలేదు.

పదిబారలదూరమునకు వచ్చునప్పటి కతనికిఁ గొన్ని మానుషవ్యక్తు లగుపడెను. ఆకారమునుబట్టి చూడ నా వ్యక్తులు గుంపునకు సంబంధించినవే యని వీరన్న కనుమానము కలిగెను. దానికిఁ దో డచ్చటనే యొక యిల్లు కూడ నుండెను. ఆలస్యమేల యని యాత డుండేలుబద్దను నెక్కిడి శిలాప్రయోగ మొనర్చెను. వ్యక్తులన్నియుఁ గలవరపడి లేచెను. కాని వీరన్న తెంపులేకుండ శిలాప్రయోగ మొనర్చుచు, నా వ్యక్తులనన్నిటిని బడగొట్టి యా యింటిని సమీపించి లోనఁ బ్రవేశించెను. అందు నలుదిక్కులు గలయఁజూచినంతనే యాతనికిఁ గన్నులు దిరిగిపోయెను. ఎచ్చోట జూచినను ధనమే. తన్నెవ్వరు

జగదేకవీరుఁడు

నడ్డుపెట్టువారు లేనందున వీరన్న ఇష్టము వచ్చినట్లు సొమ్ములు పెట్టుకొన దొడంగెను. ఎన్ని పెట్టికొనినను నాతనికిఁ దృప్తికర మగుటలేదు. తుదకు

శరీర మగుపడకుండునట్లుగా నలంకరించుకొని యుండేలు బద్దను భుజమున దగిలించుకొని మూర్తీభవించిన యభిమన్యు కుమారునివలెను, నలంకరింపబడిన పెండ్లికుమారునివలెను, జయలక్ష్మినిగైకొన్న వీరకుమారుని వలెను, నుత్సాహమున నందకుమారుని వలెను వీరన్న యాగ్రహము నిర్గమించి ప్రయాణమును సాగించి తెల్లవారునప్పటికి నరణ్యమును దాటెను. ఏమి యాబాలుని సాహసము!

జాముప్రొద్దెక్కునప్పటికిఁ బెండ్లివారు కారెమపూడికి వచ్చిచేరిరి. అందరును బండ్లు దిగి కాల్యకృత్యముల నిర్వర్తించుకొనియుండునంతలోఁ బిల్లవైపువారు వరపూజకు వచ్చిరి. అప్పుడందరికిని వీరన్నమాట తలపునకు వచ్చి యొకరి నొకరు నడుగుకొనసాగిరి. ప్రతివారును "మాకు దెలియదంటే మాకు దెలియ"దని చెప్పుచుండిరి. పోలిశెట్టి నిరుత్సాహుఁడయ్యెను.

కలరూపు

ఆతని భార్య యేడువ నారంభించెను. పెద్దన్న దిగులుపడెను. పెండ్లివారు తహతహ పడఁ జొచ్చిరి. వీరన్న యెక్కినబండివాని నడుగ "నా కేమియుఁ దెలియ" దనెను. దీనివలన వరపూజ యాగిపోయినది. కొంతమంది మనుష్యులు వెదకుటకుఁ బంపబడిరి. అప్పటి కించుమించుగా జామున్నర ప్రొద్దుదాటుచుండెను. ఒక్కరును నన్నమును ముట్టకుండిరి. అట్టిసమయమున బాలవీరుఁడు వీరన్న తనవారిని గలిసికొనెను. ఆతని వేషముగాంచి యందరు దెల్లపోయిరి. ఆ యుండేలుబద్దను, నా యలంకారములను గాంచినంతనే వారందఱికిఁ దమ్ముగా పాడినవాడతఁడేయని తెలిసిపోయెను.

అక్షణముననే ప్రతివారును వీరన్నను నెత్తిమీఁదఁ బెట్టుకొనిరి. పోలిశెట్టికిప్పుడు కుమారుని నిజవృత్తాంతము దెలియవచ్చెను. వీరన్న కప్పుడందరును బిల్ల నీయుటకు సంసిద్ధులైరి. సక్రమముగాఁ బెద్దన్నవివాహము జరిగిన కొన్నినాళ్ళకే బాల వీరన్న వివాహముగూడ నిర్వర్తింపఁబడెను. వైశ్యులు పిరికివా రను మాట నాతనివలనఁ దొలంగిపోయెను.

# ౬. వీరరాజమ్మ.

గీ॥ మానవతియైన మానినీ♦మణికిఁ బ్రాణ
రక్షణంబుగంటెను మాన♦రక్షణంబె
ముఖ్యమైన కార్యం బని ♦ బుధులు పలుక
వినమె యారీతి జరుగుట ♦ కనులఁగనమె ?

పేరిరెడ్డి కాపురస్థలము రెంటచింతల. ఆతనివంశీయు లందరు మొదటినుండియుఁ బేరుప్రతిష్ఠల గడించినవారు. పేరిరెడ్డియు మంచిసరసుఁడు. ఆకార మంత నలుపు వర్ణమును గాదు. మంచికళగల వాఁడు. ఒకమాదిరి పొట్టికుఱుచగా నుండును. పేరిరెడ్డికిఁ దండ్రి లేఁడు. తల్లి యున్నది. కాని యీతనివలె నామె యంతసరసురాలు గాదు. ఆమె యప్పుడప్పుడు కొడుకుతో లేనిపోని చీలిజగడములు పెట్టుకొని, బావిలోఁ బడతాను, చెరువులోఁబడతాను అని బెదరించుచుండెడిది.

పేరిరెడ్డి.

పేరిరెడ్డి మాత్రము తల్లిమాటల నంతగాఁ బాటింపక చాలవఱ కామె యిష్టము వచ్చినట్లు నడచుచుండెడివాఁడు. అన్నిటియందును బాగోగులను దనకుఁ దానే స్వయముగాఁ జూచుకొనవలసియున్నవాఁ డగుట వలనఁ బేరిరెడ్డి తనకుఁ దగినసంబంధమునే స్థిరపరచుకొని పెండ్లిచేసికొనెను. ఆమెయే యీకథానాయిక యగు వీర రాజమ్మ. వీరరాజమ్మ యన్నిటియందును బేరిరెడ్డికిఁ దగిన కాంతయే. ఆమె చిన్నప్పటినుండియు మంచిధైర్యసాహసములు

కలది. పనిచేయుటయం దొడలు దాచుకొను స్వభావము కలది గాదు. ఆమె కాపురమునకు వచ్చినప్పటినుండియు నత్తగారియెడల నెంతో వినయవిధేయతలఁ గనఁబరచుచుఁ దలలో నాలుకవలె మెలఁగుచుండెడిది. ఇంటిపనుల నన్నింటినిఁ జక్కఁబెట్టుచుఁ బేరిరెడ్డికిఁ గొంతవిశ్రాంతి కలిగించినది. పేరిరెడ్డియుఁ దనకుఁ దగిన యిల్లాలు లభించిన దని యుప్పొంగుచు వీరరాజమ్మను బువ్వులలోఁ బెట్టి పూజించుచుండెడివాఁడు. కాని యాతనితల్లి మొదటినుండియు గయ్యాళిగంప యగుటవలనఁ దఱచుగాఁ గోడలిమీఁద మిరియాలు నూరుచుండెడిది.

వీరరాజమ్మ.

అత్తపోరు.

అత్తగారెన్ని యన్నను గుణవతి గనుక వీరరాజమ్మ యెన్నఁడును నెదురాడి యెఱుఁగదు. ఆమెకుఁ గష్టము లేకున్నను, బేరిరెడ్డి మాత్రము భార్యకుఁ గలుగుచున్న యిబ్బందికి సహింపఁ జాలకుండెను. సహించియున్నకొలది తనతల్లి పోరెక్కువగుచున్నందునఁ బేరిరెడ్డి యొక్కొక్కప్పుడు భార్యను వెనుకవేసికొని తల్లితోఁ గలహించుచుండెడివాఁడు. కాని వీరరాజమ్మ మాత్రము గృహకల్లోలములవలనఁ బాడువఁటి కాపురము పాడైపోవు నని భర్తను సమాధానపెట్టుచుండెడిది. కాని యామె మాత్ర మెన్నాళ్ళని సహించియుండఁగలదు. తాను గూడ నొక యత్తకిందికోడలే యను మాట పేరిరెడ్డితల్లికిఁ దోచినది కాదు. వీరరాజమ్మ యింతలో పుత్రవతి యయ్యెను. బాలింతగా నున్నప్పుడేనియు నత్తగారు పనిచెప్పుట మానుచుండెడిది గాదు. పచ్చియొంటిమీఁద భార్య కేమగునో యని

పేరిరెడ్డి దిగులు పడుచుండెడివాఁడు. వీరరాజమ్మ నడుమునకు గుడ్డబిగించుకొని యోపిక యున్నంతవఱ కింటిపనులను సవరించుచునే యుండెడిది. చంటిబిడ్డకు పాలిచ్చుచున్నప్పు డిదియొకవంక బెట్టుకొని కూర్చుంటివా యనియు బలిచేసికొనునప్పుడు ఎద్దుదిన్నట్లు నీవు తింటే సరియా? పిల్లవానిని జూచుకో నక్కఱ లేదా? యనియు, సగ్గుకొలకుఁ బొరిగింటికి పేనప్పుడు వెళ్ళిన ఇంత చేటు పెత్తనాలా యనియుఁ బిడ్డకామందము లేదని చెప్పినఁ బొరుగింటియం దడిఁ మాడునకుఁ, బెట్టఁగూడదా యనియు, నీళ్లు కాఁగబెట్టునప్పుడంతచేటు కట్టెలఁ దగులఁబెట్టేటా యనియు గొంచెము సరిపాళ్ళుగా నున్నప్పు డింక కొంచెము మంటపెడితే నీసొమ్మేమున్న పోవునా యనియు నీవిధమునఁ జీటికి మాటికి వీరరాజమ్మను నత్తగారు కోపించుచుండెడిది. 'ఆ' అంటే తప్పు 'ఊ' అంటే బూతుగా నుండెను. ఎన్నినాళ్ళని వీరరాజమ్మ యత్తగారిచెర పెళ్ళఁబోయఁగలదు? ప్రతిరోజు నీవిధముగా జరుగుచున్నందువలనఁ బాపమా మెకు మనస్సు చెడిపోవ నారంభించినది. పేరిరెడ్డి యాత్రి మేమిచేయఁగలడు? తల్లిని సమాధాన పెట్టవలయునని యెంతో యత్నించుచుండెడివాఁడు. కాని యాతని నికృషియేమాత్రము నక్కఱకు వచ్చెడిది కాదు. అతఁడు యత్నించినకొలఁది యామె గయ్యాళితన మెక్కువ కాఁజొచ్చెను. అది గాంచి యతఁడు విసిగి యూరకొనెను. వీరరాజమ్మ యూపోరు బడఁజాలక గుండెరాయి చేసికొని యొకనాటిరాత్రి పసిబిడ్డను జంకబెట్టుకొని యెవ్వరికిఁ జెప్పకుండ నెచ్చటికో లేచిపోయెను.

నాఁడు దట్టముగా మబ్బుపట్టి యుండెను. ఉరుములు, మెఱుపులు విజృంభించి యుండెను. అప్పుడప్పుడు చినుకులు కూడపడ నారంభించెను. గాలిదట్టముగా వీచుచుండెను. అయ్యది రహదారియే గాని యప్పుడుమాత్రము నిర్జనమై యుండెను. రాత్రి దాదాపు రెండుజాములపొద్దు గతించెను. అట్టియెడ నాగంభీరాంధకార సముద్రంబున, నానిర్జన ప్రదేశంబున, వీర రాజమ్మ ప్రాణములు బిగబట్టి పసిబిడ్డను జంకనిడికొని యరుగు చుండెను. ఆహా! ఏమి యీసాధ్వీమణిసాహసము? పుట్టినింటికిఁ బోవలయు ననియే యీమెదృఢసంకల్పమై యుండెనోపు.

సాహసము.

ఆమె యేమాత్రమును జలింపక, ముందుమూపున నతిత్వరితముగా నరుగుచుండెను. పసిబిడ్డను గూర్చికాని, తన్ను గురించికాని యీమె యేమాత్రము విచారించి యుండలేదు. అందుకనేకదా "స్త్రీబుద్ధిః ప్రళయాంతకః" అని పెద్దలు చెప్పియుండిరది. ఆసమయమున నేదేని ముప్పు వాటిల్లినచో నామె కెవరు దిక్కు? స్త్రీ సాహసించినప్పుడట్టి సంకోచము లెవ్వియు నుండఁజాలవు. ఆమది తెగించినప్పు డెవ్వరును నాపఁజాలరు. అట్టివారిదృఢసంకల్పము నెవ్వరును మరల్పఁజాలరు. అందుఁ గులకాంత లలిగినచో వారి కెదురును నది యొకటుండగలదా? అట్టివారికిఁగోపమువచ్చిన నీటియందును నిప్పుబుట్టినట్లుగదా!

ఆ మార్గమధ్యమున బాటసారుల విశ్రాంతి కొఱకై నిర్మింపఁబడిన యొకసత్రముండెను. అప్పటికి రెండుజాములు గడచినవి. చినుకులు మెండయ్యెను. వీరరాజమ్మ పసిబిడ్డ

తడిసిపోయెనని యారాటపడుచుఁ దొందరగా నడచి యా సత్రమును జేరుకొనెను. ఆమెగుడ్డలు సంపూర్తిగాఁ దడువ లేదు. పాప మాపసిబిడ్డ గడగడ వణక నారంభించెను. తనబిడ్డ దుస్థితినిఁ గాంచినంతనే యామెకు హృదయము పగిలిపోయెను. తాను జలికి బాధపడుచున్నను, దనబాధను సరకుఁగొనక, యొకపొడిచోటఁ గూర్చుండి యాబిడ్డకుఁ బాలీయ నారంభించెను. ఆకలిబాధ మాన్పఁగలదుగాని చలి

నిలువనీడ.

బాధ నెట్లు మాన్పగలదు? పైటచెఱగుఁ గప్పుదమన్న నయ్యది తడిసియుండెను. పిల్లవాఁ డేడువనారంభించెను. ఆమెకుఁ దన పూర్వవృత్తాంతమంతయుఁ దలఁపునకు రాఁజొచ్చెను. ఆతలపు హృదయమునఁ బొడసూపినంతనే యామెకన్నులశ్రుపూరితములయ్యెను. కటకటా! అట్టి సాధ్వీ రత్నమునకా యింతటి దురవస్థ? భర్తకుఁ దెలుపకుండ వచ్చుట యామెతప్పై యుండునేమో? కాని యారాత్రి పేరిరెడ్డి యింటికడ లేడు. అత్తగారు దయావిహీనయై యామెతోఁ బోరాడి తనయింటికి రావద్దని వెళ్ళఁగొట్టెను. అప్పు డామెకు శరణ్య మేమున్నది? పొరుగింట రాత్రి యేగించుదమన్న నంతకన్న తెలవంపు లగు పని వేఱొకటి యున్నదా? ఇవి యన్నియుఁ దలచుకొనుచు నామె బిడ్డ నోదార్చుచుండెను.

చాలవఱకు సత్రము నిర్జనమై యుండెను. కాని యాసమయమునఁ బ్రక్కనున్న గదిని దెఱచుకొని యొక దీర్ఘకాయుఁడు బయటికి వచ్చెను. ఆతని గాంచినంతనే

వీరరాజమ్మకుఁ బ్రాణము లేచివచ్చినది. ఆపసిబిడ్డ యేడుపును మానలేదు. ఇంకను వాన కురియుచునే యుండెను. ఆమె యాతనిఁ గాంచినంతనే 'అయ్యా! పసిబిడ్డకుఁ గొంచెము త్రాగ నొసంగెదరా?' యని యెంతో దీనభావమున నడిగెను. అతఁడును గొంతవడి తనలో దానేదియో యాలోచించుకొని యేమియు బదులుచెప్పక లోని కరిగెను. వీరరాజమ్మ యాతనిఁ గూర్చి నిరాశ జేసికొనెను. కాని

మృత్యుగహ్వరము.

యాతఁడు కొంతకాలమునకే తిరిగి బయటికి వచ్చి 'అమ్మా! మావాళ్ళు పిలిచిరి. వాళ్ళు సమ్మతిపడిరి. లోనికి రమ్ము' అని హెచ్చరించెను. ఆమెయుఁ గొండంత యాసతో బిడ్డను జంకబెట్టుకొని లోననున్న వారతని కుటుంబమువారని యెంచి యాతని వెంట లోని కరిగెను. ఆమె లోపలఁ బ్రవేశించినంతనే తలుపులు మూయఁబడియెను. అయ్యో! అదియేమి? లోననున్నవారిని గాంచినంతనే వీరరాజమ్మ వణక నారంభించెను. అందున్నవార లాఁడువారు గారు. అందరును దీర్ఘకాయులే. వారి యాకారమును గాంచినంతనే యందున్నవారందఱు హంతకులని యామెకు సంశయము గలిగెను. సంశయ మున నేల? ఆమెకుఁ దోఁచిన భావము నిక్కమైనదియే. ఆగదియందుఁ బదిమంది యుండిరి. వారందఱును బేరువహించిన దారిదోపిడిగాండ్రు. వీరరాజమ్మకుఁ గాలు నిలువలేదు. బయటి కరుగవలయు నని యామె తలుపును దెరువఁ బోయెను. కాని వారిలో నొక డామె కడ్డమువచ్చి వెనుకకుఁ ద్రోసివైచెను.

యుండెదను. వాకిలికడనే పోసికొనిరమ్ము. దీని కంగీకరించిన
నిన్నుఁ బోనిచ్చెద మని తెలియఁజెప్పెను. ఆమె యేమియు
ననుమానము లేని దానివలె దానికి సమ్మతించెను. వా రామెను
బయటికిఁ బోనిచ్చిరి. ఒకఁ డామె పైటచెంగు పట్టుకొని తలుపు
నొద్ద నిలిచియుండెను. ఆమెయుఁ గొలదిసేపు బయటికివెళ్ళి
నట్లు మెలంగి, తిరిగి లోనికి వెళ్ళుటకై లేచినట్లు నటించెను.
పైటకొంగును బట్టుకొనియున్న యానీచుఁడు తలుపును విడచి
రెండడుగులు ముందుఁ బెట్టు నప్పటికే, వీరరాజమ్మ తనబలము
నంతయు నుపయోగించి హంతకులాశ్చర్యచకితులగునట్లుగా
దలుపును మూసి బయటి గొళ్ళెమును బిగించెను. ఆహా!
ఏమి యాయబల సాహసము? ఎంతటియుపాయము! ఆమె కించుక
మానభంగ భయము లేదు. దొంగ లింకేమి చేయఁగలరు?
అందరును గోరలూడఁబెరికిన యాశీవిషంబులమాడ్కి నుండిరి.
వీరరాజమ్మకు దైవసహాయము లభించినది. అట్లొనర్చి యాకాంత
తన బిడ్డ నేమిచేయుదురో యని విలపింప నారంభించెను. మాన
వతులకు మానముకన్న మించినది వేరేమియుండును?

దొంగ లందరా కాంతసాహసమున కచ్చెరువుపడి
యేమియుఁ జేయఁజాలకుండిరి. వాక్పారుష్యంబువలన నామెను
భయపెట్టఁజొచ్చిరి. తలుపులు బ్రద్దలుగొట్టి బయటికి వచ్చెద
మనియుఁ గిటికీలు విరుగఁగొట్టెదమనియు, గోడకుఁ గన్నము
ద్రిప్పి వెలికివచ్చి యామెను సంహరించెదమనియు ననేక
విధముల భయపెట్టఁ దొడంగిరి. కాని యామె యేమాత్రము
వారిమాటలను బాటింపలేదు. భయమువలనఁ బని కానేర దని

యా హంతకులు తా మా కాంతను జెరుపమనియు మాటవిని తలుపుదీసినయెడల సురక్షితముగా నామె నింటికిఁ జేర్చెదమనియు, నామె పతివ్రతాత్వము బరీక్షించుటకై యిదివర కట్టామెను నిర్బంధించి యుంటిమనియు నిట్లనేక విధముల నమ్మకము కలుగునట్లు శాంతవచనము లుగ్గడింప మొదలుపెట్టిరి. కాని యామె యింతమాత్రముననే వారిని నమ్మునా? దొంగలు తమ నేర్పు నంతయు వినియోగించిరి. తలుపులను బలవంతముగా నెత్తుటకు యత్నించిరి. కిటికీచువ్వలను పెరుకఁగొట్టుటకై తమబలమంతయుఁ జూపిరి. కాని యవి యన్నియు నిష్ప్రయోజనము లయ్యెను. అందొక్కటియేనియుఁ గొనసాగినది కాదు. దొంగ లొనర్చుచున్న యీ యార్భాటముల వలన నింతవరకు నిద్రించుచున్న యీ పసిబిడ్డ మేల్కాంచి పాలకై యేడువసాగెను. ఆయేడుపువిననంతనే వీరరాజమ్మకుఁ దొందరపాటు కలిగినది. కాని యేమి చేయఁగలదు? తలుపు దెఱచినఁ దనకు మానభంగము నిశ్చయము. తెఱువకున్న బిడ్డకుఁ బ్రాణసంకటము.

గొంతుకోత.

ఆమెకు సందిగ్ధావస్థ కలిగినది. ఒకవంకఁ గన్నకడుపు. ఒక వంక నతులితమగు మానసంరక్షణము! ఇందామెకుఁ గర్తవ్య మేదియో పాఠకులే నిర్ణయింపవలయును? ఈశ్వరాజ్ఞ యెట్లున్నదో యట్లు కాక మానదని యామెగుండె రాయి చేసికొనెను. ఆపసిబిడ్డరోదనమును విననంతనే దొంగల కొక చక్కనియుపాయము దోచినది. వారా పసిబిడ్డ నెత్తుకొని

'ఓసీ! ఇంకనైనఁ దలుపుదీయుము? తీయకున్నచో నీయెదుటనే, నీపసిబిడ్డను ముక్కలుముక్కలుగాఁ దరిగెదము. ఇది తప్పదు. ఆలోచించుకొనుము' అని వీరరాజమ్మకుఁ దెలియఁ జెప్పిరి. ఆవాక్యముల వినినంతనే యామె కెవ్వున కేకవైచెను. ఒకటే యేడుపు. కన్నకడుపు కాలిపోవుచున్నప్పుడు, చూచి యోర్చుకొనఁగలవా రెవ్వరు? కాని యామెకు వేరుగతి లేదు. అన్నిటికంటె నామెకు మానరక్షణమే ముఖ్యమై యుండెను. అదియేగదా కులసతీమణులకుఁ దగినకృత్యము. దొంగల కామె యేమియు బదులు చెప్పలేదు. వారు కొంతతడవూరకుండి తిరిగి యావిధముగనే యామెకుఁ జెప్పిరి. కాని యిప్పటికి నామెనోట మాటలేదు. హంతకులు మూఁడవమారు చెప్పిరి. అప్పుడామెకుఁ దనబిడ్డ మరణము నిశ్చయమని తోచెను. కంటికిఁ గడివెడుగా వలపోయుచు నాకటికివాండ్రను నెంతయో ప్రార్థింపఁ దొడంగెను. వినువారలకు గుండెనీరగునట్లు బతిమాలఁ జొచ్చెను. ఆపసిగందును వదలి తన్ను జెరుపకుండఁ దనప్రాణములఁ గొనుఁడని పల్కెను. ఎన్నియో రీతుల వారిహృదయమును మరల్చుటకు యత్నించెను. కాని యాదుర్మార్గుల హృదయ మంతమాత్రమున కేమారఁగలదా? కడసారి చెప్పుచుంటిమని తిరిగి హెచ్చరించిరి. ఆమాట విన్నవెంటనే యామెస్మృతితప్పి నేలఁబడిపోయెను. దొంగలకుఁ గోపమినుమడించెను. వారింకసహింపలేక పోయిరి. ఛీ! దీనికిఁదగినశాస్తి కావలసినదేయని యాపసిబిడ్డను, నోరెఱుంగని యాపొత్తులకందువును, స్తన్యపానమునకై యేడ్చు

చున్న యాచంటి బిడ్డను, ముద్దులుమూటఁగట్టుచున్న యా
ముద్దు బిడ్డను - కరుణలేక - కరకు తురకలవలె - పుత్రప్రేమ
నెఱుంగని పాషాణహృదయులవలె - ఆదొంగలు - ఆనీచులు-
ఆశిశుహంతకులు - పరాంగనాపహరణోద్యుక్తులు - తమ
కఱకుఁ గత్తులకు నెఱఁజేసిరి. ముక్కలు ముక్కలుగాఁ గోసిరి.
ఆకసుగందని మేనికండలను, ఆరక్తమును జూచువారలగుండె
లవియునట్లు గిటికీసందులగుండ బయటికిఁ జల్లిరి. అంతటితో
నాహంతకులు తృప్తిపడిరి. ఇట్టి శిశుహంతకులకుఁ దగిన
శాస్తి కాకుండునా ? దైవము సహించి యుండునా ?

అప్పటికి రాత్రి మూడుజాములు గతించినవి వానతగ్గి
నది. అట్టియెడ సరకుల నెగుమతికై కొనిపోవుచున్న బండ్లు
దాదాపేబదికి మించు సంఖ్యగలవి యామార్గముననే వచ్చు
చుండెను. దూరమునుండియే బండ్లసందడి వినవచ్చుచుండెను.
గదియందున్న దొంగల కారాటము హెచ్చెను. ఆబండ్లన్ని
యు నచ్చటికి వచ్చినయెడలఁ దమవృత్తాంతమంతయు
నాబండ్లవారికిఁ దెలియఁగలదనియుఁ దన్మూలమున వారికి
మరణము ప్రాప్తమగుట నిశ్చయమనియు వారూహించుకొని
మునుముందుగనే తప్పించుకొనిపోవుటకై యత్నింపసాగిరి.
ఇంతలో స్మృతితప్పి పడిపోయిన వీరరాజమ్మకుఁ దెలివివచ్చెను.
ఆమె లేచి చూచునప్పటికి దనబిడ్డయేడుపు వినరాలేదు.
ఆమెకు గుండె పగిలిపోయెను. బండ్లు దాపునకు వచ్చుచున్న
సంగతి యామెకుఁ దెలియవచ్చెను. పాపము! ఆమెకు దుఃఖ
మాగలేదు. ఎలుగెత్తి యేడువ నారంభించెను. ఆయేడుపు

దూరముననున్న బండ్లవారికి వినవచ్చెను. వారందరును నిదియే మిరాయని నడివడిగ నెద్దుల నదలించుచుఁ గొలఁదికాలమున కే యాసత్రమును సమీపించిరి. సమీపించి చూచునప్పటికి మూర్తీభవించిన శోకదేవతవలె వీరరాజమ్మ వారికిఁ గానవచ్చెను. అందరును బండ్లనాపి యామె చుట్టునిలిచి యావద్వృత్తాంతమును దెలిసికొనిరి. పసిబిడ్డ మరణవృత్తాంతము వారికి దెలియవచ్చినంతనే యాకాపులందరికిని శరీరములు గంపింపఁజొచ్చెను. ఒక్కమొగి నందరును జేతికఱ్ఱలయందున్న గండ్రగొడ్డళ్ళను బయటికి లాగిరి. ఆకుఠారములను ఆకాపుల విజృంభణమును గాంచినంతనే వీరరాజమ్మకు దుఃఖమంతయు నశించి వీరశివమెత్తెను. మూర్తీభవించిన మహాకాళివలె నామె విజృంభించి, కాపులందరు విభ్రమచేతస్కులగునట్లు చెంతనున్న యొక్క కాపు చేతియందలి కుఠారమును లాగుకొని యొక్క పెట్టున దలుపు దెఱచెను.

ఆహా! అప్పటి యాకాంత వీరరసాతిరేక మే మని వర్ణించవచ్చును! మహిషాసురసంహారకారిణి యగు మహాశక్తివలె విజృంభించియుండెను. కాపులందరును సాయుధులై యామె ననుసరించిరి. తలుపు దెఱవఁబడినంతనే హంతకులును సాయుధులై స్వప్రాణరక్షణమునకుఁ బరప్రాణాపహరణంబునకు సిద్ధపడియుండిరి. కాని వీరరాజమ్మ వీరస్వరూపమును గాంచినంతనే దొంగలు కంపింపఁ జొచ్చిరి.

వీ- కాంత.

లోపలి కరిగినంతనే వీరరాజమ్మకు శరీరమే తెలియకుండెను. కాపులందరు శివమెత్తినట్లు క్రోధాతి

శేకంబున జిందులు ద్రొక్కుచుండిరి. దొంగలందరు వీర రాజమ్మపై కురికిరి. ఆమె చలింపలేదు. అట్లు తనపైకి వచ్చిన దొంగలలో నిద్దరినిఁ బ్రథమాహుతిగాఁ దనగొడ్డలి కర్పించెను. కాపులు చెలరేగిరి. కాని యాకాంత వారిని ముందునకు రానీక, తానొక్కతెయే, యాహంతకులపై విజృంభించెను. దొంగలు కొందరు పారిపోవ యత్నించుచుండిరి. అట్టివారు, కాపుల సిశితకుఠారములకు బలియగుచుండిరి. దొంగలు పదిమందియే యైనను, వారి తేరినవారగుట వలనఁ గాపుల కనాయాసముగ సాధ్యపడకుండిరి. కాని వీరరాజమ్మ కాపులకే మాత్రము హానికలుగకుండునట్లు తానే హంతకులను ముందుగా నెదుర్కొనుచుండెను. ఆ దొంగల నెత్తురు తనశరీరమునఁ బడినంతనే యాకాంత యుప్పొంగుచుఁ దనకు గాయము లగుచున్నను లక్ష్యముసేయక వారిని జిత్రవధసేయుచుండెను. ఆమెవలన నార్వురుదొంగలు మడిసిరి. తక్కిన నలుగురిలో నిద్దరు కాపులవలన హతులైరి. మిగిలిన యిద్దరును కాయములనిండ గాయములుగలిగి నిలువఁ జాలక పడిపోయి బాధపడుచుండిరి. హంతకులందరు హతులగుటఁ గాంచి కాపులు శాంతించిరి. కాని యాకాంత శాంతింపలేదు. ఆమె విజృంభణ మింకను దగ్గలేదు. క్రోధానల మింకను జల్లార లేదు. ఆమెశరీరమునఁ గలిగిన గాయములనుండి రక్తము ప్రవహించుచుండెను. నెత్తుటియందుఁ దేలుచున్న యాహంతకుల నింకను ముక్కలు ముక్కలుగాఁ గోయుచుండెను. వారికొత్తనెత్తుటియందు స్నాన మాడుచుండెను. శివ

మెత్తినట్లు చిందులు ద్రొక్కుచుండెను. కాపులందరు నామెయాకారమును గాంచుటకే భయపడుచుండిరి. రుధిరస్నానము వలన నామెకు శరీరము తెలిసినది. శాంతము కలిగినది. కాపులందరిని నొక్కమారు తేరిపారంజూచినది. గదియంతయు నలుదిక్కులం గలయం జూచెను. పాపము అచ్చోట నొకమూల నాకాంతకుం దన పసిపాపనిశిరము గనంబడెను. ఆక్షణముననే వీరము శోకమయ్యెను. పుత్రునిశిరమును గైకొని కెవ్వున కేక వైచి భువిపైం బడిపోయెను. ఇంక నాకాంత లేదు. తన వీరచారిత్రమును నిందు వదలి యుందు వీరకాంత లుండు స్థానము నలంకరించెను. ఆమెచరిత్ర మిప్పటికిని బ్రతిధ్వనించుచునే యుండెను.

సంపూర్ణము.